# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :260 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: శనివారం 27-12-2025 పేజీలు:4 వెల: 2.00


## కెనడాలోని టొరంటోలో కాల్పులు.. మరో భారతీయ విద్యార్థి హత్య

కెనడా: కెనడాలోని టొరంటోలో భారతీయులపై వరుస ఘటనలు ఆందోళనలు కలిగిస్తున్నాయి. భారతీయ యువతి హిమాన్షి ఖురానా హత్య ఘటన మరవకముందే టొరంటోలో మరో విషాదం నెలకొంది. 20 ఏండ్ల శివాంక్ అవస్థిని దుండగుడు కాల్చి చంపడం కలకలం రేపింది. శివాంక్ స్కార్‌బొరొగ్ యూనివర్సిటీలో లైఫ్ సైన్సెస్ విభాగంలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. స్థానిక హైల్యాండ్ క్రీక్ టెయిల్ వద్ద డిసెంబర్ 23వ తేదీన ఓ దుండగుడు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శివాంక్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కాల్పుల విషయం తెలుసుకుని తాము అక్కడికి వెళ్లేసరికి దుండగుడు పారిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. శివాంక్ హత్య నేపథ్యంలో యూనివర్సిటీ కాలేజీ క్యాంపస్‌ను కాసేపు మూసివేశారు. ఈ ఘటనతో ఈ ఏడాది కెనడాలో హత్యల సంఖ్య 41కి చేరినట్లు అధికారులు తెలిపారు. శివాంక్ హత్యపై కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. టొరంటో స్కార్‌బోరొగ్ క్యాంపస్ సమీపంలో జరిగిన కాల్పుల్లో భారత విద్యార్థి శివాంక్ మరణించడం అత్యంత విషాదకరమని పేర్కొంది. ఈ కష్టకాలంలో మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చింది.

## ఇదే లాస్ట్ ఛాన్స్.. అద్దె భవనాల ఖాళీపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు!



హైదరాబాద్,ఈ నెల 23న సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర సచివాలయంలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక అంశాలపై ఆయన అధికారులతో చర్చించారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌కు అనుగుణంగా అధికారులు పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణపై ఆయన కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో ప్రైవేటు అద్దె భవనాల్లో కార్యకాపాలు కొనసాగిస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు వెంటనే వాటిని ఖాళీ చేయాలని సూచించారు. ఇందుకోసం ఆయన ఈరోజు వరకు డెడ్‌లైన్ విధించారు. ప్రభుత్వ భవనాలు అందుబాటులో ఉన్నప్పటీ అద్దె భవనాల్లో ఆఫీస్‌లను ఏర్పాటు చేసి అద్దె చెల్లించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో ఉన్న ఆఫీస్‌లను ప్రభుత్వ భవనాల్లోకి మార్చడం ద్వారా ప్రభుత్వానికి ప్రతి ఏడాది రూ. 650 కోట్లు ఆదా అవుతుందని తెలిపారు. గత 12 సంవత్సరాలలో ప్రభుత్వ కార్యాలయాల అద్దెల కోసం ప్రభుత్వం దాదాపు రూ. 7,800 కోట్లు ఖర్చు చేసిందని, దీని కారణంగా ప్రతి ఏడాది ప్రభుత్వం రూ. 650 కోట్ల భారం పడుతున్నట్టు అధికారులు తెలిపారు. పరిపాలన వికేంద్రీకరణ కోసం కొత్త జిల్లాలు, మండలాలు ఏర్పడిన తర్వాత, శాశ్వత కార్యాలయ మౌలిక సదుపాయాలు త్వరితగతినా పూర్తి కాలేదని, దీనివల్ల హైదరాబాద్‌లోని అధిక అద్దె ప్రాంతాలతో సహా అనేక విభాగాలు అద్దె భవనాల అక్కడి నుంచే పనిచేయడం కొనసాగించాల్సి వచ్చిందన్నారు. కానీ ఇప్పుడు ప్రభుత్వ భవనాలు ఉన్నప్పటికీ.. ఇంకా ప్రభుత్వ ఆఫీస్‌లను అక్కడే కొనసాగించడం సరికాదన్నారు. వీటిపి ప్రభుత్వ కార్యాయాల్లోకి తరలించడం ద్వారా మిగిలే ఖర్చును ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించవచ్చని స్పష్టం చేశారు. దీంతో పాటు ప్రస్తుతం ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఆస్తుల సమగ్ర జాబితాను రూపొందించాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారుజ వీలైనంత త్వరగా మారుతున్న కార్యాలయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు. ప్రభుత్వ భవనాలు అందుబాటులో లేని చోట, కొత్త భవనాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలని గుర్తించాలని సూచించారు. అయితే హైదరాబాద్‌లోని అనేక కార్యాలయ భవనాలను ఏపీ ప్రభుత్వం ఖాళీ చేయించింది, కానీ 2019 నుండి అన్నీ ఖాళీగానే ఉన్నాయని పేర్కొన్నారు. అద్దె ఖర్చుల వల్ల ప్రభుత్వంపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతున్నప్పటికీ ఈ ఆస్తులను ఎందుకు సమర్థవంతంగా వాడుకోవట్లేదని ఆయన అధికారులను ప్రశ్నించారు. అద్దెలను నిరంతరం చెల్లించడం వల్ల ప్రజాధనం వృధా కాకుండా నివారించవచ్చని ఆయన నొక్కిచెప్పారు. తక్షణ దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

## తెలంగాణపై బీజేపీ ప్రత్యేక వ్యూహం!



హైదరాబాద్,తెలంగాణలో వచ్చే ఎన్నికల కోసం బీజేపీ పక్కా ప్లాన్ ప్రకారం ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో బీజేపీని బలపరిచేందుకు ఆర్ఆర్ఎస్ రంగంలోకి దిగింది. నేడు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. మరోవైపు, గురువారం హైదరాబాద్‌లో బీఎంఎస్(భారతీయ మజ్దూర్ సంఘ్) కార్యాలయాన్ని సర్ కార్యవాహ దత్తాత్రేయ హొసబలె ప్రారంభించారు. ఆర్ఎస్ఎస్‌కు బీఎంస్ అనుబంధ సంస్థగా కొనసాగుతోంది. కాగా, తెలంగాణలో ఆర్ఎస్ఎస్ ప్రముఖుల పర్యటనలు ఆసక్తి రేపుతున్నాయి. నగర శివారులోని కన్హా శాంతి వనంలో విశ్వ సేవక్ సంఘ్ శిబిరం గత మూడు రోజులుగా కొనసాగుతోంది. ఈ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ హాజరుకానున్నారు. అయితే, తెలంగాణపై ఆర్ఎస్ఎస్, బీజేపీ ఫోకస్ పెట్టినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ప్రముఖుల పర్యటనలు ఉన్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇక, బీజేపీ బలోపేతంలో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలో ఆర్ఎస్ఎస్ శాఖల పెంపు, కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి. 2025లో 392 కొత్త శాఖలను ఆర్ఎస్ఎస్ ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు 3800 శాఖలు ఉండగా.. 2026 నాటికి 4000 శాఖల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం. మరోవైపు.. 'భాగ్యనగర్' వంటి పేర్లతో సాంస్కృతిక పునరుద్ధరణకు ప్రయత్నిస్తోంది. ఇది రాష్ట్ర రాజకీయాల్లో, సామాజిక రంగంలో ఒక ముఖ్యమైన అంశంగా మారనుందని విశ్లేషకులు చెబుతున్నారు.

### బీఎంఎస్ ప్రారంభం..

సర్ కార్యవాహ దత్తాత్రేయ హొసబలె గురువారం హైదరాబాద్‌లో బీఎంఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎంఎస్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా అభివర్ణించారు. ఇక, ఆర్ఎస్ఎస్‌తో అనుబంధంగా కార్మిక రంగంలో ప్రత్యేక శక్తిగా బీఎంఎస్ ఎదుగుతోంది. బీఎంఎస్.. కార్మికుల హక్కులు, జాతీయ ప్రయోజనం, స్వదేశీ ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా ఉంటుంది. ఇది కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తుంది. కార్మికులకు అవగాహన కార్యక్రమాలు, శిక్షణా శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తోంది. కార్మికుల వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతపై ఫోకస్ చేస్తుంది. అలాగే, స్వదేశీ ఉత్పత్తులకు మద్దతుగా స్వదేశీ జాగరణ కార్యక్రమాలు చేపట్టింది. ఆర్ఎస్ఎస్ మద్దతుతో బీఎంస్‌కు రాజకీయ, సామాజిక స్థాయిలో విస్తృత ప్రభావం ఉంది. దీంతో, తెలంగాణ కార్మిక సంఘాల విషయంలో బీఎంస్ కొత్త ప్రభావం చూపించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో బీజేపీ బలోపేతంగా దిశగా ఇవన్నీ కార్యక్రమాలు జరుగుతున్నట్టు పొలిటికల్ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

## యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తులు.. డిసెంబర్ 31 కోసం భారీ ఏర్పాట్లు




యాదగిరి:తెలంగాణ తిరుపతి యాదగిరి గుట్ట భక్తుల రద్దీతో కిక్కిరిపోయింది. సంవత్సరాంతపు సెలవులు, క్రిస్మస్ పండుగ వంటి శుభ దినాలు కలిసి రావడంతో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి భక్తులు బారుతీరారు. ఉదయం తెల్లవారు జాము నుంచే ఆలయ సముదాయం రద్దీగా మారింది.. హైదరాబాద్, వరంగల్, చుట్టుపక్కల జిల్లాల నుండి TSRTC బస్సులు, ప్రైవేట్ వాహనాలు భారీగా రావడంతో పార్కింగ్ ప్రాంతాలు, %ఎఎఖా% సూట్‌లు, పుష్కరిణి సమీపంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఉదయం 10 నుంచి 11గంటల ప్రాంతంలో గుట్టలో భారీ రద్దీ కనిపించింది. కొండ కింద రింగ్ రోడ్డులో నుంచి మూడవ ఘాట్ రోడ్డు మార్గమంతా వాహనాలతో నిండిపోయింది. కొండపైన ఆలయ పరిసరాలు, ముఖమండపం, క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు వంటి ప్రాంతాలు భక్తులతో నిండిపోయాయి. వారాంతాల్లో కనిపించే రద్దీ కంటే నిన్న ఎక్కువ మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక క్యూలు, వీఐపీ దర్శన కౌంటర్లు, 24 గంటలూ అన్నదానం (ఉచిత భోజనం) ఏర్పాట్లు ఉన్నాయని, ఆన్‌లైన్ దర్శన స్లాట్లు వేగంగా నిండిపోతున్నాయని ఆలయ అధికారులు తెలిపారు. శ్రీ సుదర్శన హోమం కూడా పూజారులు నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి, నూతన సంవత్సర వేడుకల కారణంగా 2026 జనవరి 1 వరకు రద్దీ కొనసాగే అవకాశం ఉందని, భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్. వెంకట్ రెడ్డి తెలిపారు. డిసెంబర్ 30న జరిగే వైకుంఠ ఏకాదశి వేడుకలకు యాదగిరి గుట్టలో ఇప్పటికే సన్నాహాలు ముమ్మరం చేశారు ఆలయ అధికారులు.

## సీఎం రేవంత్ తోలు తీస్తాననన్న తర్వాతి రోజు కేసీఆర్ ఎక్కడ?



హైదరాబాద్,గతంలో మాదిరి కాదు. ఇప్పుడు సమాచారాన్ని అందించే బాధ్యత ఒక్క మీడియా మాత్రమే కాదు. అంతకు వెయ్యి రెట్లు ఎక్కువ ఉత్సాహంతో సోషల్ మీడియా దూసుకెళుతోంది. అయితే.. ఇందులో నిజమెంత? అబద్ధమెంత? అన్న విషయాన్ని క్రాస్ చెక్ చేసుకోవాల్సిన అవసరం ఉంటుంది. అవి మినహాయించి.. స్వేచ్ఛకు ఎల్లలు లేవు. కొన్ని సందర్భాల్లో అత్యుత్సాహంతో వ్యవహరించే సోషల్ మీడియాతో తప్పుడు అంశాలకు ప్రచారం లభిస్తుంటాయి. తాజాగా చెప్పే ఉదంతానికి సంబంధించి మాత్రం.. మీడియా సైతం రిపోర్టు చేయటం ఆసక్తికర అంశంగా చెప్పాలి. సుదీర్ఘ విరామం తర్వాత గులాబీ బాస్ కేసీఆర్.. ఆదివారం హైదరాబాద్ లో పార్టీ నేతలతో రివ్యూ నిర్వహించటం.. అనంతరం మీడియాతో మాట్లాడటం తెలిసిందే. ఈ సందర్భంగా రెండేళ్లుగా తాను మౌనంగా ఉన్నానని.. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగినంత సమయాన్ని ఇచ్చానని.. ఇకపై తాను మౌనంగా ఉండనంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండేళ్లుగా తాను మౌనం పాటించి.. చూస్తున్నప్పటికి పరిస్థితుల్లో మార్పు లేదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇప్పుడు బయలుదేరినట్లుగా చెప్పిన కేసీఆర్.. "ఇయ్యాలటి నుంచి వేరు కథ. రేపటి నుంచి మరో కథ. తోలు తీస్తా" అంటూ రేవంత్ సర్కారుపై సంచలన వ్యాఖ్యలు చేయటం తెలిసిందే. ఈ తీవ్ర హెచ్చరిక అనంతరం తన భవిష్యత్ ప్లాన్ మీద ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చామని.. బ్రహ్మాండమైన కరపత్రాన్ని కూడా తయారు చేస్తున్నామని.. నిత్యం ప్రజల్లో ఉంటానన్నట్లుగా కేసీఆర్ మాటలు సాగాయి. ఇంతలా మాట్లాడిన పెద్ద మనిషి.. అదే రోజు సాయంత్రం హైదరాబాద్ నుంచి ఎర్రవెల్లి ఫాంహౌస్ కు చేరుకున్న కొత్త విషయాన్ని తాజాగా ప్రధాన మీడియా సంస్థ రిపోర్టు చేసింది. దీంతో.. కేసీఆర్ గతంలో చేసిన వ్యాఖ్యలు.. అందుకు భిన్నంగా వ్యవహరించే తీరుపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున పోస్టులు పెడుతూ ప్రశ్నిస్తున్నారు. సంచలన వ్యాఖ్యలు చేయటం..తాట తీస్తా.. తోలు తీస్తా.. లాంటి వ్యాఖ్యలు చేయటమే తప్పించి.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి.. ప్రజా సమస్యలపై స్పందించటం.. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే విషయంలో కేసీఆర్ మొదట్నించి వెనుకగానే ఉంటారన్న విమర్శ ఉంది. అయితే.. ఇప్పుడున్న పరిస్థితుల్లో తన నోటి నుంచి వచ్చే మాటలకు భిన్నంగా తన తీరు ఉండటాన్ని కేసీఆర్ వీలైనంతగా మార్చుకోవాల్సిన అవసరం ఉంది. 2024 లో నల్లగొండలో నిర్వహించిన సభ సందర్భంలోనూ కేసీఆర్ ఇదే తరహాలో మాట్లాడారని అప్పటి మాటల్ని గుర్తు చేస్తున్నారు. "ఈడికెల్లి నేనుగూడ ఊకోను. నేను బయలుదేరుతా. ఎందాకైనా మంచిదే" అంటూ హెచ్చరించిన కేసీఆరర్ ఆ తర్వాత మాత్రం మళ్లీ కనిపించని పరిస్థితి. అంతేకాదు..బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీకి వచ్చిన ఆయన.. ఇకపై తాను యాక్టివ్ గా ఉంటానని.. ప్రభుత్వాన్ని పరుగులు తీయిస్తానని చెప్పినప్పటికీ.. ఆ తర్వాత కూడా ఫామ్ హౌస కే పరిమితమైన ఉదంతాల్ని ప్రస్తావిస్తున్నారు. ఊకే మాటలు చెప్పుడు.. ఫాంహౌస్ కు వెళ్లుడు తీరుకు ఫుల్ స్టాప్ పెట్టాల్సిన అవసరం ఉందని గులాబీ నేతలే గుసగుసలాడుకోవటం గమనార్హం.

## చనిపోయిన ఉగ్రవాదులకూ ట్రంప్ క్రిస్మస్ శుభాకాంక్షలు..



వాషింగ్టన్, నైజీరియా వాయవ్య ప్రాంతంలో ఐసిస్ ఉగ్రవాదులు లక్ష్యంగా అమెరికా భారీ దాడులు చేపట్టినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. "నిరపరాధ క్రైస్తవులను దారుణంగా హతమార్చుతున్న ఐసిస్ ఉగ్రవాదులపై శక్తివంతమైన, ప్రాణాంతక దాడులు నిర్వహించాం" అని ట్రంప్ తెలిపారు. క్రిస్మస్ వేళ ఈ దాడులు జరగడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కమాండర్ ఇన్ చీఫ్‌గా నా ఆదేశాల మేరకు నైజీరియా వాయవ్య ప్రాంతంలో ఐసిస్ ఉగ్రవాదులపై అమెరికా సైన్యం ఖచ్చితమైన దాడులు చేసిందని ట్రంప్ తన సోషల్‌మీడియా వేదిక ట్రూత్ సోషల్ ద్వారా వెల్లడించారు. ప్రధానంగా క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు ఇది తమ ప్రతిస్పందన అని తెలిపారు. రాడికల్ ఇస్లామిక్ టెర్రరిజం ఎదగడానికి తమ పాలనలో అవకాశం ఉండదని స్పష్టం చేశారు. అమెరికా సైన్యానికి ఆ దేవుడి ఆశీర్వాదాలు ఉండాలని ఆకాంక్షించారు. చనిపోయినా ఉగ్రవాదులకు కూడా మెరీ క్రిస్మస్ అంటూ శుభాకాంక్షలు తెలిపారు. నైజిరియాలో ఉగ్రవాదులపై అమెరికా సైన్యం దాడులను US ఆఫ్రికా కమాండ్ కూడా ధ్రువీకరించింది. నైజీరియా ప్రభుత్వ అభ్యర్థన మేరకు దాడులు నిర్వహించామని వెల్లడించింది. తమ దాడిలో పలువురు ఐసిస్ ఉగ్రవాదులు హతమయ్యారని వెల్లడించింది. అయితే తమ దేశంలోని భద్రతా సమస్యలు మతపరమైన కోణానికి మాత్రమే పరిమితం కావని నైజీరియా ప్రభుత్వం స్పష్టం చేసింది. ముస్లింలు, క్రైస్తువులు రెండు మతాల వారిపైనా దాడులు జరుగుతున్నాయని తెలిపింది. క్రైస్తవులపై మాత్రమే దాడులు జరుగుతున్నాయన్న ట్రంప్ వ్యాఖ్యలు తమ దేశంలోని పరిస్థితులకు సరిపోవని తెలిపింది. అయినప్పటికీ ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు అమెరికాతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది.

### గొంతుకోసి యువకుడి హత్య...

హైదరాబాద్, నగర శివార్లలో ఓ యువకుడి దారుణ హత్య కలకలం రేపుతోంది. గుర్తు తెలియని దుండగులు యువకుడి గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కవేలిగూడ వద్ద, మొయినాబాద్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన మహేష్(26) అనే యువకుడిని గుర్తుతెలియని వ్యక్తులు గొంతు కోసి దారుణంగా హతమార్చారు.

## మళ్లీ ఘోరం... బంగ్లాలో మరో హిందూ వ్యక్తిని కొట్టి చంపారు!



ఢాకా,గత కొన్ని రోజులుగా బంగ్లాదేశ్ లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఒక్కమాటలో చెప్పాలంటే... షరీఫ్ ఉస్మాన్ హైదీ మరణానంతరం బంగ్లాదేశ్ లో అంతర్లీనంగా అశాంతి పెద్ద ఎత్తున ఆక్రమించింది. ఈ నేపథ్యంలో దీపు చంద్రదాస్ అనే హిందూ వ్యక్తిని అరాచక మూకా ఒకటి కొట్టి చంపింది. అతని మృతదేహాన్ని చెట్టుకు కాల్చి నిప్పి పెట్టింది. ఈ ఘటనను యావత్ భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ క్రమంలో మరో హిందూని కొట్టి చంపారు. అవును... బంగ్లాదేశ్ లో అరాచక మూకా దీపు చంద్రదాస్ అనే హిందూ వ్యక్తిని కొట్టి చంపిన కొన్ని రోజుల తర్వాత మరో ఘోరం చోటు చేసుకుంది. ఇందులో భాగంగా... బంగ్లాదేశ్ లో మరో హిందూ వ్యక్తిని కొట్టి చంపినట్లు గురువారం స్థానిక మీడియా నివేదించింది. బాదితుడిని అమృత్ మండల్ అలియాస్ సామ్రాట్ గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం రాత్రి దాడి జరగ్గా.. గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్లు చెబుతున్నారు. నివేదికల ప్రకారం... సామ్రాట్ అనే వ్యక్తి గత ఏడాది షేక్ హసీనా బహిష్కరణ తర్వాత దేశం విడిచి పారిపోయి, ఇటీవల కలిమోహెూర్ యూనియన్ లోని తన గ్రామం హొసెండంగాకు తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో.. అతను, అతని బ్యాచ్ లోని కొంతమంది సభ్యులు గ్రామస్థుడు షాహిదుల్ ఇస్లాం ఇంటికి వెళ్లి డబ్బు వసూలు చేశారని అంటున్నారు. ఈ సమయంలో.. కుటుంబ సభ్యులు ఎదురు తిరిగారని చెబుతున్నారు. ఈ క్రమంలో.. వారంతా... దొంగ దొంగ అని అరవడం ప్రారంభించారని.. దీంతో ఇతర గ్రామస్తులు రావడంతో ఆ బ్యాచ్ సభ్యులు మొత్తం పారిపోయారని.. అయితే, సామ్రాట్ మాత్రం వారికి దొరికిపోయాడని చెబుతున్నారు. దీంతో అతన్ని పట్టుకున్న గ్రామస్థులు తీవ్రంగా కొట్టారని అంటున్నారు. ఈ సందర్భంగా స్పందించిన పాంగ్షా సర్కిల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ దెబ్రత్ సర్కార్ మాట్లాడుతూ... పోలీసులు సామ్రాట్ ను ఆ గుంపు నుంచి రక్షించారని.. అనంతరం ఆసుపత్రికి తరలించారని, అయితే అక్కడ చికిత్స పొందుతూ అతడు గురువారం తెల్లవారు జామున 2 గంటల ప్రాంతంలో మృతి చెందాడని తెలిపారు. ఈ సందర్భంగా.. ఇప్పటికే సామ్రాట్ పై పాంగ్షా స్టేషన్ లో రెండు కేసులు ఉన్నాయని.. వాటిలో ఒకటి హత్య కేసు అని తెలిపారు. కాగా... గత గురువారం ఢాకాకు సుమారు మూడు గంటల దూరంలో ఉన్న మైమెన్ సింగ్ లో 25 ఏళ్ల చంద్రదాస్ పై ఓ సహోద్యోగి దైవదూషణ ఆరోపణలు చేయడంతో.. ఓ గుంపు అతన్ని కొట్టి చంపిన సంగతి తెలిసిందే. అనంతరం.. అతని మృతదేహాన్ని చెట్టుకు కట్టి నిప్పు పెట్టింది. ఈ ఘటనపై భారత్ లోని వివిధ ప్రదేశాల్లో నిరసనలు చెలరేగాయి. అయితే.. దాస్ దైవ దూషణకు పాల్పడ్డాడనటానికి ఎలాంటి ఆధారాలు లేవని అధికారులు చెబుతున్నారు.

## ఇక నుంచి జీహెచ్ఎంసీలో 12 జోన్లు, 60 సర్కిల్స్..!




హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డివిజన్ల పునర్విభజనకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ డీలిమిటేషన్‌కు సంబంధించి గురువారం రాత్రి ప్రభుత్వం తుది నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. డివిజన్ల సంఖ్యను 300కు పెంచుతూ నోటిఫికేషన్‌ను జారీ చేసింది ప్రభుత్వం. ఇక జీహెచ్ఎంసీలో ప్రస్తుతం ఉన్న 6 జోన్లను 12 జోన్లకు, 30 సర్కిల్స్‌ను 60 సర్కిల్స్‌కు పెంచుతున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

### కొత్త జోన్‌లు ఇవే..

కొత్త జోన్‌లుగా ఉప్పల్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, శంషాబాద్, గోల్కొండ, రాజేంద్రనగర్ ఏర్పడ్డాయి. సర్కిల్ కార్యాలయాల్లో కొత్త జోన్ కార్యాలయాలు, వార్డు కార్యాలయాల్లో నూతన సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. డివిజన్ల డీలిమిటేషన్‌కు సంబంధించి ఈనెల 9న ప్రాథమిక నోటిఫికేషన్ వెలువడగా.. 10 రోజులపాటు అభ్యంతరాలు స్వీకరించారు. 6వేలకు పైగా అభ్యంతరాలు రాగా.. సహేతుకమైన వాటిని పరిగిణనలోకి తీసుకొని తుది నోటిఫికేషన్ విడుదల చేశారు.

## సంపాదకీయం

**శనివారం 27-12-2025**

# సేవ్ ఆరావళి కోసం ఉద్యమించాలి !

ఇప్పటికే ప్రకృతి విధ్వంసం యధేచ్ఛగా సాగుతోంది. దేశంలో ప్రకృతిని రక్షించాలన్న బాధ్యత ప్రభుత్వాలకు లేకుండా పోయింది. యధారాజా తథా ప్రజ అన్నట్లుగా ప్రజలు కూడా ఈ విధ్వంసంలో పాలుపంచుకుంటున్నారు. గ్రామాల్లో చెరువులు, కుంటలు, చిన్నచిన్న గుట్టలు మాయం అవుతున్నాయి. ఇసుకను తోడేస్తున్నారు. అడవులను ధ్వంసం చేస్తున్నారు. దీని ప్రభావంతో వాతావరణ మార్పులు తీవ్రంగా చోటుచేసుకుంటున్నాయి. దీనికితోడు విపరీతమైన ప్లాస్టిక్ ఎక్కడ పడితే అక్కడ గుట్టలుగా పేరుకుపోతోంది. చెరువులు, నదులు, సముద్రాలు కలుషితం అవుతున్నా ప్రభుత్వాల్లో చీమకుట్టినట్లుగా కూడా లేదు. దీంతో పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నా కఠిన చర్యలు తీసుకోవడం లేదు. దీనికితోడు ప్రకృతి విధ్వంసం ఆపాల్సిన ప్రభుత్వాలు చోద్యం చూడడమే గాకుండా ప్రకృతిని విధ్వంసం చేస్తున్నాయి. ఆంధ్రాలో సముద్రతీరంలో ఉన్న మడ అడువులను ధ్వంసం చేశార. అలాగే రుషికొండను ధ్వంసం చేసి జగన్ విలాసవంతమైన భవనాలు కట్టుకున్నాడు. కొల్లేరు సరస్సు పూర్తిగా ధ్వంసం అయ్యింది. హైదరాబాద్ లో హుస్సేన్ సాగర్ కాలుష్య కాసారంగా మారింది. ఇవన్నీ కొన్ని మాత్రమే. ఎందరో ఆందోళనలు చేసినా, చిప్కో లాంటి ఉద్యమాలు వచ్చినా కదలిక రాకపోవడం దారుణం కాక మరోటి కాదు. కేరళ విలయం చూసిన తరవాత కూడా ప్రభుత్వాలు కళ్లు తెరవడం లేదు. ఉత్తరాఖండ్ విలయం చూసినా కొండలను విధ్వంసం చేయడం ఆపడం లేదు. తాజాగా ప్రకృతి నిర్మించిన రక్షణ కవచం ఆరావళి పర్వత శ్రేణులను కూడా విధ్వంసం చేసే కార్యక్రమం మొదలు కావడం ఈ దేశం చేసుకున్న దౌర్భాగ్యం తప్ప మరోటి కాదు. అటవీ, జల, ఖనిజ ఇతర సహజ వనరులను అందిస్తూ.. నాలుగు రాష్ట్రాల సామాజిక, ఆర్థిక ప్రగతికి దోహద పడుతున్న ఆరావళిలోని 90 శాతం ప్రాంతాలకు మైనింగ్, రియల్ ఎస్టేట్ ముప్పు పొంచి వుంది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు హర్యానా, రాజస్తాన్, గుజరాత్ వరకూ దాదాపు 700 కిలోమీటర్ల మేర విస్తరించివున్న ఈ పర్వత శ్రేణి థార్ ఎడారి నుంచి వచ్చే ఇసుక, ధూళిని అడ్డుకోవడంలో కీలకమైనవని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక స్పష్టం చేస్తోంది. యూరోపియన్ దేశాల్లో ప్రకృతిని రక్షించేందుకు పాటుపడుతుంటే, మనం మాత్రం విధ్వంస రచన చేస్తున్నాం. మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు దోచిపెట్టేందుకు కేంద్రం రంగం సిద్ధం చేస్తున్నట్లుగా వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి.. వందల కోట్ల సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన ప్రపంచంలోనే అతి పురాతన మడత పర్వత శ్రేణుల్లో ఒకటైన ఆరావళిని విధ్వంసం చేసుకోవ డమంటే మనదేశాన్ని మనం నాశనం చేసుకోవడమే. కూర్చున్న కొమ్మను నరుక్కోవడమే అవుతుంది. ఇక్కడ ఖనిజాల కోసం పర్వత శ్రేణులను ధ్వంసం చేసే యత్నాలు అడ్డుకోవాల్సిందే. ఇక్కడ తవ్వకాలకు ఆమోదం తెలపడం అంటే పర్యావరణానికి, జీవ కారుణ్యానికే కాదు.. మానవ మనుగడకే ప్రమాదకరంగా భావించాలి. సామాజిక మాధ్యమ వేదికల్లో ఉత్తరాదిన ప్రారంభమైన 'సేవ్ ఆరావళి క్యాంపెయిన్' రోజురోజు కూ దేశవ్యాప్తంగా విస్తరిస్తోంది. ఉత్తర భారతానికి పచ్చని పరుపులా ఉన్న ఆరావళిని కాపాడాలన్న హ్యాష్ ట్యాగ్‌లతో విద్యావంతులు, మేధావులు, పర్యావరణ వేత్తలు, నిపుణులు ముక్తకంఠంతో నినదిస్తున్నారు. అక్రమ మైనింగ్‌ను ఎలా చట్టబద్ధం చేస్తారని కేంద్రాన్ని నిలదీస్తున్నారు. పీపుల్ ఫర్ ఆరావళీస్' సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం అనూహ్యంగా పెరిగిన పట్టణీకరణ, ఖనిజాన్వేషణలతో అడవుల్లో ముమ్మరంగా సాగుతున్న తవ్వకాలు, నివాస ప్రాంతాల విస్తరణ వల్ల హర్యానా, రాజస్థాన్‌లోని ఛార్ఖీ దాద్రి, భివాని జిల్లాల్లో పర్వతాలు ధ్వంసమై జీవవైవిధ్యం నాశనమైంది. ఒక్క రాజస్థాన్‌లోనే దాదాపు 25శాతం కొండలు హరించుకు పోయాయని 2018లోనే సుప్రీంకోర్టు నియమించిన కేంద్ర సాధికార సంఘం తేల్చిచెప్పింది. 25 వేలకుపైగా ఎకరాల్లో కొండలు కనుమరుగయ్యాయి. 2011–17 మధ్యలో ఆరావళి శ్రేణుల నుంచి 9.80 లక్షల టన్నుల ఖనిజ వనరులను అక్రమంగా తరలించారనేది కాగ్ నివేదిక తెలిపింది. మైనింగ్, రియల్ ఎస్టేట్ అక్రమాలపై నాలుగు వేలకుపైగా కేసులు న్యాయస్థానాల్లో మూలుగున్నాయి. హర్యానాలోని ఫరీదాబాద్ పరిసర ప్రాంతాల్లో ఖనిజ తవ్వకాలను 2002లోనూ, నాలుగు రాష్ట్రాల్లో తవ్వకాలను 2009లోనూ నిషేధిస్తూ సుప్రీంకోర్టు తీర్పులిచ్చినా అమలు చేసే బాధ్యతల నుంచి ప్రభుత్వాలు తప్పుకున్నాయి. పర్వతాల స్వరూపం మార్చకూడదన్న సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు చుట్టూ మైనింగ్ జరుగుతుంటే ఎలా అమలవు తాయన్న ఆలోచన చేయడం లేదు. ఢిల్లీ నుంచి థార్ వరకూ ఎడారిగా మారుతుందని, భూగర్భ జలాలు అడుగంటుతాయని, వాయు కాలుష్యంతో ఢిల్లీసహా ఆయా రాష్ట్రాల నుంచి వలస పోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందంటున్న పర్యావరణవేత్తల హెచ్చరికలు పాలకుల చెవికెక్కడం లేదు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న 'ఆరావళి గ్రీన్‌వాల్ ప్రాజెక్టు'ను ప్రారంభించిన ప్రధాని ఢిల్లీ నుంచి గుజరాత్ వరకూ అడవులు పెంచడమే లక్ష్యమన్నారు. వేలాది ఏళ్లుగా పర్యావరణానికి పెట్టని కోటగా ఉన్న ఆరావళిని కాపాడుకోవడం, భవిష్యత్ తరాలకు భద్రంగా అప్పగించడం, 'సేవ్ ఆరావళి'కి మద్దతు పలకడం మనందరి బాధ్యత. మన రాష్ట్రంలోనూ లేటరైట్, బాక్సైట్ తదితర విలువైన ఖనిజాలను తవ్వి కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు అత్యుత్సాహం చూపే పర్యావరణ వినాశక చర్యలకు అడ్డుకట్ట పడాలి. పర్యావరణ విధ్వంసం చేసే ఎలాంటి చర్యలనైనా ప్రజలు ప్రతిఘటించాలి. మనకెందుకులే అనుకుంటే రేపటి మనతరం అంతం కావడం ఖాయం.

# బంగ్లాదేశ్‌లో 'భారత వ్యతిరేక' భావాలను రెచ్చగొడుతోంది ఎవరు?



ఢాకా,బంగ్లాదేశ్‌లో డిసెంబర్ 18వతేదీ రాత్రి రెండు మీడియా సంస్థలు, కొన్ని సాంస్కృతిక సంస్థలపై మూక దాడి చేయడాన్ని ఈ ప్రతినిధి చూశారు. ఇంక్విలాబ్ మంచ్ కన్వీనర్, అధికార ప్రతినిధి ఉస్మాన్ హాదీ మరణం తరువాత ఆందోళనాకారుల గుంపు 'ప్రథమ్ అలో, ది డైలీస్టార్' అనే రెండు మీడియా సంస్థల కార్యాలయాలపై దాడి చేసింది. ఆఫీసు ఫర్నీచర్ ధ్వంసంచేసి, నిప్పంటించింది. ఛాయానట్ భవన్‌పైనా దాడి చేసి తగలబెట్టింది. ఈ సంస్థలపై 'భారత ఏజెంట్లు' 'ఫాసిజం మిత్రులు' అని ముద్ర వేశారు. బంగ్లాదేశ్ స్వాతంత్ర్య పోరాటంలో భారత్ సాయం చేసింది. అయితే సరిహద్దు ప్రాంతాల్లో హత్యలు, నదీ జలాల పంపిణీలో సమస్యలు, తమ దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం వంటి వాటి వల్ల బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేక భావన తరచూ పెరుగుతూ వచ్చిందని విశ్లేషకులు అంటున్నారు. తాజాదాడులు బంగ్లాదేశ్ రాజకీయాల్లో ఎప్పటికప్పుడు పెరుగుతున్న భారత వ్యతిరేక భావజాలానికి నిదర్శనమని కొంతమంది నమ్ముతున్నారు. బంగ్లాదేశ్‌ను 16నెలలుగా పాలిస్తున్న తాత్కాలిక ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతల పరిస్థితి ప్రధాన సమస్య అని విశ్లేషకులు అంటున్నారు. ఈ అస్థిర పరిస్థితి నుంచి బంగ్లాదేశ్ బయటపడటానికి ఎన్నికలే మార్గం. కానీ, ఎన్నికలు జరగకుండా అడ్డుకోవాలని భావిస్తున్న ఓ సమూహం భారత వ్యతిరేకతను ప్రేరేపించి హింసను రెచ్చగొడుతోందని కొందరు రాజకీయ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ది డైలీ స్టార్ కార్యాలయం మీద దాడి జరిగినప్పుడు 28 మంది జర్నలిస్టులు కొన్ని గంటల పాటు పైకప్పు మీద దాక్కున్నారు.

### హాదీ మరణం సాకుతో భారత వ్యతిరేక రాజకీయం

గతేడాది జూలై ఉద్యమం తర్వాత బంగ్లాదేశ్‌లో చాలా కాలంగా చెలరేగుతున్న భారత వ్యతిరేక భావన కొత్త రూపాన్ని సంతరించుకుంది. షేక్ హసీనా భారత్‌కు వచ్చిన తర్వాత అనేక మంది ఆవామీ లీగ్ నాయకులు, కార్యకర్తలు భారత్‌లో ఆశ్రయం పొందారు. దీంతో ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలలో ఉద్రిక్తత ఏర్పడింది. "ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఎప్పుడూ చురుకైన ప్రతిఘటన ఉంటుంది. అధికారం కోల్పోయిన ప్రభుత్వానికి భారత ప్రభుత్వం మద్దతు ఇచ్చింది" అని ఢాకా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాజీ మార్ఫుల్ ఇస్లాం అన్నారు. షేక్ హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ కోరినప్పటికీ ఆమెను వెనక్కి పంపకపోవడం, ఉస్మాన్ హాదీని హత్య చేసిన వారు భారత్‌లో తల దాచుకున్నారని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతో ఇరు దేశాల దౌత్య సంబంధాల్లో ఉద్రిక్తత మరింత పెరిగిందని విశ్లేషకులు అంటున్నారు. అయితే హాదీని హత్య చేసిన వారు దేశం విడిచి వెళ్లినట్లు కచ్చితమైన ఆధారాలేవీ లభించలేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. "నిందితులు సరిహద్దు దాటారా లేదా అనేది మేమింకా నిర్ధరించలేదు" అని బంగ్లాదేశ్ పోలీసు అడిషనల్ ఐజీ ఖాండేకర్ రఫీఖుల్ ఇస్లాం అన్నారు. ఆ తదుపరి హోంమంత్రిత్వ శాఖ సలహాదారు మీడియాతో మాట్లాడుతూ "నిందితుల ఆచూకీ గురించి కచ్చితమైన సమాచారం ఉంటే వారిని అరెస్టు చేసి ఉండేవారు" అని చెప్పారు. ■

### భారత వ్యతిరేక భావనే హింసకు ఆయుధమా?

బంగ్లాదేశ్ రాజకీయాల్లో భారత్‌పై వ్యతిరేకతను అప్పుడప్పుడు వ్యూహాత్మకంగా ఉపయోగిస్తారని విశ్లేషకులు చెబుతున్నారు. రెండు మీడియా సంస్థలు, సాంస్కృతిక సంస్థ ఛాయానట్, ధన్మొండి-32 నివాసంపై ఆందోళనాకారులు దాడి చేసినప్పుడు భారత వ్యతిరేక నినాదాలు వినిపించాయి. దాడుల సమయంలో జమాత్‌తో పాటు విద్యార్థి సంఘాల నాయకులు ఈ సంస్థలకు వ్యతిరేకంగా ప్రకటనలు చేశారు. ఉస్మాన్ హాదీ మరణించారని తెలిశాక బంగ్లాదేశ్‌లో ఆకస్మిక నిరసనలు చెలరేగాయి. ఆ తర్వాత జరిగిన సమావేశంలో రాజ్‌షాహి యూనివర్సిటీ విద్యార్థి సంఘ నేత మోస్తకుర్ రెహమాన్ "ఈ రోజు జరిగిన ఘటనల ద్వారా ప్రథమ్ అలో, ది డైలీ స్టార్ వంటి వార్తాపత్రికలను మూసివేస్తామని ప్రకటిస్తున్నాం" అని చెప్పారు. మోస్తకుర్ రెహమాన్ ఈ వ్యాఖ్యలు చేసిన రోజే "రాజకీయ పోరాటం ద్వారా బంగ్లాదేశ్‌కు నిజమైన స్వాతంత్ర్యం సాధించడం సాధ్యం కాదు. షహీద్ ఉస్మాన్ హాదీ నాయకత్వంలోని ఇంక్విలాబ్ మంచ్ చేస్తున్న సాంస్కృతిక పోరాటంతో కలిపి మా పోరాటం ప్రారంభమవుతుంది. బామ్, షాబాగి, ఛాయనత్, ఉడిచిలను ధ్వంసం చేయాల్సి వస్తుంది. అప్పుడే బంగ్లాదేశ్‌కు నిజమైన స్వాతంత్ర్యం" అని ఇస్లామీ ఛత్ర క్యాంప్‌లోని జహంగీర్‌నగర్ విశ్వవిద్యాలయ శాఖ కార్యదర్శి ముస్తాఫిజుర్ రెహమాన్ అన్నారు. మోస్తకుర్ రెహమాన్, ముస్తాఫిజుర్ రెహమాన్ వ్యాఖ్యలపై వివరణ కోసం బీబీసీ వారిని సంప్రదించింది. వారు తమ వ్యాఖ్యల్ని ఖండించలేదు. అయితే వాటికి వేర్వేరు అర్థాలు చెప్పారు. ఈ సంస్థలు ఆవామీ లీగ్‌కు ఇచ్చిన చట్టబద్ధతను ముగించడమే తమ వ్యాఖ్యల ఉద్దేశమని చెప్పారు. అలాగే రెండు మీడియా సంస్థలు పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నాయన్నారు. మరోపక్క తమ నాయకులు చేసిన వ్యాఖ్యల వల్లే హింస జరిగిందని నిందించడానికి కుట్ర జరుగుతోందని ఇస్లామిక్ స్టూడెంట్ క్యాంప్ చెబుతోంది. ఇలాంటి కుట్రలను తాము వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడించింది. "మత ఆధారిత రాజకీయాల ద్వారా బలోపేతం కావాలని భావిస్తున్న సంస్థలకు భారత వ్యతిరేక నినాదాలు చేయడం అనుకూలంగా ఉంటుంది. జూలైలో విద్యార్థుల ఆందోళనలు, హసీనా భారత్‌లో తలదాచుకోవడం వంటివి భారత్‌పై ఆగ్రహాన్ని పెంచాయి. ఇప్పుడు హాదీ మరణాన్ని కూడా మత ఆధారిత రాజకీయాలు చేసే సంస్థలు ప్రభావవంతంగా ఉపయోగించుకుంటున్నాయి" అని కౌన్సిల్ ఆఫ్ సెక్రటరీస్ చైర్మన్ నూరుల్ కబీర్ చెప్పారు. "బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేయాలని భావించే వర్గానికి భారత వ్యతిరేక నినాదాలను తలకెత్తుకోవడం సౌకర్యవంతంగా ఉంటుంది" అని ఆయన అన్నారు. మీడియా సంస్థలపై దాడి జరుగుతుంటే పోలీసులు నిస్తేజంగా నిల్చున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

### ప్రభుత్వ పాత్రపై ఆరోపణలు

దాడి జరగడానికి ముందే, తమకు రక్షణ కల్పించాలని ప్రభుత్వంలో అత్యున్నత స్థాయి వ్యక్తులను సంప్రదించినప్పటికీ తమకు సాయం అందలేదని ప్రథమ్ అలో, ది డైలీ స్టార్ ఆరోపించాయి. భద్రతా దళాలు ఘటనా స్థలానికి చేరుకున్నప్పటికీ, వారు అల్లరిమూకను నియంత్రించ డానికి ఎటువంటి చర్యా తీసుకోలేదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. దీంతో హింసచెలరేగడం వెనుక ప్రభుత్వ పాత్రపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. "తాత్కాలిక ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఇప్పటివరకూ ఏ విభాగం పైనా ప్రభుత్వానికి పట్టు లేదు. తాత్కాలిక ప్రభుత్వమే ఈ హింసను ప్రేరేపిస్తున్నట్లు కనిపిస్తోంది" అని ప్రొఫెసర్ ఖాజీ మార్ఫూల్ ఇస్లాం అన్నారు. ఈ దాడికి సంబంధించి 300 మందికి పైగా గుర్తు తెలియని వ్యక్తులపై ఛాయానట్ ఫిర్యాదు చేసింది. ప్రథమ్ అలో, ది డైలీ స్టార్‌పై దాడులకు సంబంధించి కొంతమందిని అదుపులోకి తీసుకున్నారు. అయితే సంఘటన జరిగిన రోజున సోషల్ మీడియాలో కనిపిస్తున్న అనేక వీడియోలలో ఒకదాంట్లో ఓ సైనిక అధికారి దాడి చేసిన వారిని నియంత్రించడానికి బదులు వారితో మంతనాలు జరపడం కనిపించింది. భవనంలో చిక్కుకున్న జర్నలిస్టులను రక్షించేందుకు అవకాశం ఇవ్వాలని దాడి చేయడానికి వచ్చినవారిని ఆయన 20 నిముషాల పాటు అడుగుతున్నట్లు కూడా ఆ వీడియోలో ఉంది. ప్రభుత్వంలోని ఒక వర్గం మద్దతుతోనే ఇలాంటి హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయని న్యూఏజ్ ఎడిటర్, ఎడిటర్స్ కౌన్సిల్ చైర్మన్ నూరుల్ కబీర్ అన్నారు. "ది డైలీ స్టార్, ప్రథమ్ అలో కార్యాలయాలపై దాడుల వ్యవహారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఈ సంఘటనలు జరగాలని కోరుకునే వ్యక్తులు మూహమ్మద్ యూనస్ ప్రభుత్వంలో, పాలక వర్గంలో ఉన్నారని కచ్చితంగా చెబుతాను" అని ఆయన అన్నారు. నేషనల్ సిటిజన్ పార్టీ కన్వీనర్ నహీద్ ఇస్లాం కూడా ఇలాంటి ఆరోపణలే చేశారు. పార్టీ బాధ్యతలు చేపట్టడానికి ముందు నహీద్ దాదాపు ఏడున్నర నెలల పాటు తాత్కాలిక ప్రభుత్వానికి సలహాదారుగా పనిచేశారు. ఎడిటర్స్ కౌన్సిల్, వార్తాపత్రికల యజమానుల సంఘ సంయుక్త నిరసన ర్యాలీలో నహీద్ మాట్లాడుతూ "వాళ్లు మా నినాదాన్ని ఉపయోగించుకుని దాడులు చేసి, దానికి సానుకూల అభిప్రాయన్ని ఆపాదించారు. ఈ దాడుల్లో ప్రభుత్వం కూడా భాగస్వామి అని మేం చెబుతున్నాం" అన్నారు.

# ఆన్‌లైన్ ట్రేడింగ్ పట్ల జాగ్రత్త పడాలి

హైదరాబాద్,ఆన్‌లైన్ ట్రేడింగ్ పట్ల జాగ్రత్త పడాలని, అనుమనిత గ్రూపులకు ఆకర్శితులు కావద్దని, పంజాబ్ మాజీ ఐపిఎస్ ఉదంతంతో క్రైమ్ పోలీసుల హెచ్చరిక చేశారు. సోషల్ మిడియా, టెలిగ్రామ్, వాట్సప్ గ్రూపుల ద్వారా ఆన్‌లైన్ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లు గణనీయంగా పెరుగుతున్నాయి. క్రిప్టో కరెన్సీ, ఫారెక్స్, స్టాక్ ట్రేడింగ్‌లో అత్యధిక లేదా గ్యారంటీ లాభాల పేరు చెప్పి సైబర్ నేరగాళ్లు అమాయకులకు టోకరా వేస్తున్నారు. బాధితులను ఆకర్షించి, వెబ్‌సైట్లు, ట్రేడింగ్ డాష్‌బోర్డులు, యాప్స్ ద్వారా నకిలీ లాభాలు చూపిస్తూ మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ప్రలోభ పెడుతున్నారు. ఇలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సిటీ పోలీస్ సైబర్ క్రైమ్ యూనిట్ పౌరులకు సూచించింది. పంజాబ్ కేడర్‌కు చెందిన మాజీ ఐపీఎస్ అధికారి, రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ అమర్ సింగ్ చాహల్ ఇలానే వాట్సప్ ఆధారిత పెట్టుబడి మోసానికి గురై సుమారు 8.10 కోట్లు పోగొట్టుకున్నారని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. 2 నెలల పాటు మోసగాళ్ల వలకు చిక్కి.. స్నేహితులు, బంధువుల వద్ద సుమారు రూ.7.5 కోట్ల మేర అప్పుగా తీసుకున్నారని తెలిపారు. తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడికిలోనై చివరకు ఆత్మహత్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. సైబర్ పెట్టుబడి మోసాల వల్ల కలిగే భయంకర పరిణామాలను ఈ ఉదంతం తెలియజేస్తోందని పేర్కొన్నారు. కాబట్టి ప్రజలు నిర్ధారణ కాని పెట్టుబడి ప్లాట్‌ఫారాలకు దూరంగా ఉండాలని, ఆన్‌లైన్‌లో లాభాలను చూపించే ప్రకటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని హైదరాబాద్ సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులు పౌరులకు సూచించారు. ఫేస్‌బుక్, టెలిగ్రామ్, వాట్సప్‌లో తెలియని వ్యక్తి నుంచి ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్‌గా నటిస్తూ సందేశం వస్తుంది. తొలుత నమ్మకం కలిగించి, ఆపై త్వరగా లాభాలు వచ్చే ట్రేడింగ్ అవకాశాలను పరిచయం చేస్తాడు. ఆరంభంలో తక్కువ మొత్తంతో పెట్టుబడి పెట్టాలని చెబుతారు. వాట్సప్‌లో నిరంతరం మార్గదర్శనం చేస్తూ నిజమైన ట్రేడింగ్ జరుగుతున్నట్టు భ్రమ కలిగిస్తారు. పెట్టుబడి తర్వాత బాధితుడికి మోసపూరితంగా రూపొందించిన ప్లాట్‌ఫారమ్‌లో నకిలీ లాభాలు చూపిస్తారు. అవి నిజమైన లాభాలేనని బాధితుడు నమ్మేలా చేస్తారు. బాధితుడు డబ్బు విత్‌డ్రా చేయాలనగానే.. ట్యాక్స్, కరెన్సీ కన్వర్షన్, విత్‌డ్రాయల్ ఫీజులు, కంప్లయెన్స్ ఛార్జీల వంటి పేర్లతో చెల్లింపులు అడుగుతారు. ఇలా చెల్లించిన ప్రతిసారీ కొత్త కారణం చెప్పి మరిన్ని డబ్బులు డిమాండ్ చేస్తారని హెచ్చరించారు. బాధితుడు సందేహించగానే లీగల్ యాక్షన్ తీసుకుంటామని, లేదా వాలెట్ ఫ్రీజ్ అవుతుందని భయపెడతారు. బాధితుడు మరింత చెల్లిస్తూనే ఉంటాడే తప్ప.. సొమ్ము విత్‌డ్రా ఎప్పటికీ జరగదు. అప్పటికి గానీ అది సైబర్ మోసమని బాధితులు తెలుసుకోలేకపోతున్నారని హెచ్చరించారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు గ్యారంటీగా వస్తాయని చెప్పేవారిని విశ్వసించొద్దు. పెట్టుబడులకు ఎల్లప్పుడూ రిస్క్ ఉంటుందన్నారు. బ్యాంక్ అకౌంట్ నంబర్లు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, యూపీఐ పిన్‌లు వంటివి ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు.

# క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని నడిపిన ధీశాలి

హనుమకొండ, ఆర్థిక సంస్కరణల దార్శనికుడు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అని శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. పీవీ నర్సింహారావు వర్థంతి సందర్భంగా హనుమకొండ లోని పీవీ నర్సింహారావు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని స్థిరత్వం వైపు నడిపిన అపూర్వ మేధావి, బహుభాషా పండితుడిగా, పరిపాలనలో ఆయన తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయన్నారు. తెలంగాణ బిడ్డగా దేశ ప్రధానిగా ఎదిగి, ప్రపంచ పటంలో భారతదేశానికి గౌరవం పెంచిన మహనీయుడని ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశాన్ని ఆర్థిక సంస్కరణల బాట పట్టించిన నాయకుడు పీవీ నర్సింహారావు అని అన్నారు. యువత పీవీ నర్సింహారావు జీవితం నుంచి క్రమశిక్షణ, సహనం, దేశభక్తిని నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నొడితల సతీష్‌కుమార్, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ, తెలంగాణ ముదిరాజ్ మహాసభ యూత్ రాష్ట్ర కార్యదర్శి పులి రజినీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని పీవీ నర్సింహారావు విగ్రహానికి పూలమాలల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

# ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ సహకారంతో, వరదలు,పారిశ్రామిక ప్రమాదాల ప్రతిస్పందన అంశాలపై 22 డిసెంబర్ న తొలిసారిగా రాష్ట్ర స్థాయి మాక్ ఎక్సర్‌సైజ్‌ను నిర్వహించింది. ఇటీవలి సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్రంలో అనూహ్యమైన ,వివరణలేని వాతావరణ మార్పులు చోటుచేసుకుంటూ, రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో అకస్మాత్తుగా భారీ వర్షాలు ,ఆకస్మిక వరదలు సంభవిస్తున్నాయి. అదేవిధంగా, ఇటీవల కాలంలో రాష్ట్రం కొన్ని ప్రధాన పారిశ్రామిక ప్రమాదాలకు కూడా సాక్ష్యంగా నిలిచింది. వరదలకు గురయ్యే ప్రాంతాల ఆధారంగా ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌ను 12 జిల్లాల్లో ఖమ్మం, వరంగల్, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, హైదరాబాద్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి మరియు హనుమకొండలో నిర్వహించారు. ప్రధాన పారిశ్రామిక ప్రాంతాల ఆధారంగా ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌ను 5 జిల్లాల్లో సంగారెడ్డి, మెడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, నల్గొండ అలాగే హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో నిర్వహించారు. మాక్ ఎక్సర్‌సైజ్‌ల ప్రధాన లక్ష్యాలు రాష్ట్రం, జిల్లాలు మరియు వివిధ శాఖల సన్నద్ధతను పరీక్షించి మరింత బలోపేతం చేయడం, ఇన్సిడెంట్ రెస్పాన్స్ సిస్టమ్‌ను కార్యరూపంలోకి తేవడం, శాఖల మధ్య సమన్వయం మరియు అత్యవసర మద్దతు విధుల ప్రభావాన్ని అంచనా వేయడం, అలాగే జిల్లా కలెక్టర్లు మరియు ఇతర ఏజెన్సీల పాత్రలపై స్పష్టత కల్పించడం జరిగింది. మాక్ ఎక్సర్‌సైజ్‌లు వరద ప్రమాద హెచ్చరిక సంకేతాలు అత్యవసర విధానాలపై మెరుగైన అవగాహనను కల్పించాయి. ముందస్తు హెచ్చరిక,సమాచార వ్యవస్థల ప్రభావాన్ని పరీక్షించి లోపాలను గుర్తించారు. శాఖలు,స్పందన బృందాల పాత్రలు, బాధ్యతలు మరింత స్పష్టంగా అవగాహనకు వచ్చి సమన్వయం మెరుగుపడింది. సకాలంలో ప్రజలను తరలించడం, సురక్షిత తరలింపు మార్గాలు మరియు ఆశ్రయాలను గుర్తించడం ఎంత ముఖ్యమో ఈ వ్యాయామాలు హైలైట్ చేశాయి. అత్యవసర స్పందన బృందాలు, పరికరాలు, రక్షణ వనరుల సన్నద్ధతను అంచనా వేశారు. శాఖల మధ్య మెరుగైన సమన్వయం అవసరమని, వరదల సమయంలో ప్రజల అవగాహన మరియు సహకారం ఎంత ముఖ్యమో స్పష్టం అయింది. మానవ వనరులు, పరికరాలు మరియు లాజిస్టిక్స్‌లో ఉన్న లోపాలను గుర్తించి, మెరుగుదల ప్రణాళికలకు దోహదపడింది. సన్నద్ధత కొనసాగించడానికి క్రమం తప్పని శిక్షణలు మరియు మాక్ డ్రిల్లుల అవసరాన్ని పునరుద్ఘాటించింది. వాస్తవ వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు స్పందన బృందాలు మరియు సంబంధిత వర్గాల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. పారిశ్రామిక ప్రమాదాల మాక్ ఎక్సర్‌సైజ్‌ల నుంచి కూడా అనేక పాఠాలు నేర్చుకున్నారు. ముఖ్యంగా అగ్నిప్రమాదాలు మరియు రసాయన ఘటనల సమయంలో సమీప పరిశ్రమల మధ్య పరస్పర సహాయం అవసరం, మానవ వనరులు, పరికరాలు మరియు నైపుణ్యాలను పంచుకోవడం ద్వారా స్పందన సమయాన్ని, నష్టాలను తగ్గించవచ్చని గుర్తించారు. అగ్నిమాపక శాఖ, పోలీస్ మరియు వైద్య సేవల వంటి బాహ్య ఏజెన్సీలతో

# ఇచ్చిన మాట కోసం ఇప్పటంలో పవన్... వృద్ధురాలి నుంచి ఆశీర్వాదం!



అమరావతి,పవన్ కల్యాణ్ రాజకీయ ప్రయాణంలో ఇప్పటం గ్రామం కూడా కీలక భూమిక పోషించిన సంగతి తెలిసిందే. ఈ ప్రాంతంలో జనసేన ఏర్పాటు చేసిన సభకు భారీ స్పందన వచ్చింది. 2022లో పార్టీ 8 వసంతాలు పూర్తి చేసుకుని, 9వ ఏట అడుగుపెట్టిన సందర్భంగా నాడు ఆ సభ జరిగింది. ఆ సమయంలో జనసేన ఆవిర్భావ సభకు భూములు ఇచ్చారనే కక్షతో ఇప్పటంలో జనసేన కార్యకర్తల ఇళ్లు కూల్చివేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అప్పుడు పెద్ద రాద్ధాంతమే జరిగింది! పవన్ నిప్పులు చెరిగారు. ఇదే క్రమంలో.. వైసీపీ హయాంలో జనసేన కార్యకర్తల ఇళ్లు కూల్చి వేయడంతో ఆ గ్రామంలో పవన్ కల్యాణ్ పర్యటించారు. బాధితులకు ధైర్యం చెప్పారు. తానున్నానని భరోసా కల్పించారు. ఈ నేపథ్యంలోనే.. ఎన్నికల్లో గెలిచాక మళ్లీ ఇప్పటం రావాలని ఇండ్ల నాగేశ్వరమ్మ అనే వృద్ధురాలు ఆయన్ను కోరింది.. పవన్ సరేనని మాట ఇచ్చారు. అవును... మాట ఇచ్చే ముందు ఆలోచిస్తారు.. ఇచ్చాక ఇంక ఆలోచించేదేముందు.. చేసేయడమే కాదా! ఈ నేపథ్యంలోనే ఏపీలో కూటమి అధికారంలోకి రావడం, పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి కావడం జరిగింది. ఇ సమయంలో నాడు ఇప్పటంలో వృద్ధురాలు నాగేశ్వరమ్మకు ఇచ్చిన మాటకు కట్టుబడి పవన్ కల్యాణ్ బయలుదేరారు. ఇందులో భాగంగా.. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలంలోని ఇప్పటం చేరుకున్నారు. నాగేశ్వరమ్మ ఇంటికి వెళ్లారు. ఈ సమయంలో నాగేశ్వరమ్మ పవన్ కు ఆప్యాయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె పాదాలకు నమస్కరించి పవన్ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె పవన్ ను ఆత్మీయ ఆలింగనం చేసుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సమయంలో.. ఆ వృద్ధురాలికి రూ.50 వేలు, ఆమె మనవడి చదువుకు రూ. లక్ష ఆర్థిక సాయం అందించిన పవన్.. ఆమె మనవడి చదువుకు ప్రతి నెల తన వేతనం నుంచి రూ.5 వేలు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కాసేపు ఆ కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. అనంతరం వృద్ధురాలు నాగేశ్వరమ్మ మాట్లాడారు. ఈ సందర్భంగా... ఇచ్చిన మాట ప్రకారం పవన్ కల్యాణ్ తమ ఇంటికి రావడం సంతోషంగా ఉందని అన్నారు. ఇంటికి పెద్ద కుమారుడిలా యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారని.. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారని ఆమె తెలిపారు.

### కుర్చీలతో కొట్టుకున్న జనసేన కార్యకర్తలు!:

ఇలా ఇచ్చిన మాటకు కట్టుబడి పవన్ కల్యాణ్ చేపట్టిన ఇప్పటం పర్యటన కార్యకర్తల్లో ఉత్సాహం నింపాల్సి ఉండగా.. దురదృష్టవశాత్తు క్షేత్రస్థాయిలో నాయకుల మధ్య ఉన్న ఆధిపత్య పోరును బహిర్గతం చేసినట్లయ్యిందనే చర్చకు దారితీసింది! ఇందులో భాగంగా.. పవన్ రాకముందు ఏర్పాట్ల విషయంలో స్థానిక నాయకుల మధ్య మొదలైన చిన్నపాటి ఘర్షణ.. పెద్ద వివాదానికి దారితీసింది. దీంతో కార్యకర్తలు కుర్చీలతో కొట్టుకున్నారు. ఈ ఘర్షణల్లో కొందరు కార్యకర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్తులకు భరోసా ఇవ్వడానికి, కృతజ్ఞతలు చెప్పడానికి పవన్ వస్తున్న తరుణంలో ఇలా సొంతపార్టీలోనే ఇలా కుర్చీలు ఇచ్చుకుని కొట్టుకునే స్థాయి విభేదాలు బయటపడటం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో అక్కడే ఉన్న పోలీసులు స్పందించి లాఠీలకు పనిచెప్పడంతో.. వాతావరణ కాసేపు ప్రశాంతంగా మారింది!

# ఇన్స్యూరెన్స్ డబ్బుల కోసం భర్త హత్య

మహబూబాబాద్, జిల్లాలో కేసముద్రం మండలం బోడమంచ్యా తండాలో వీరన్న అనే వ్యక్తి దారుణ హత్యలో అసలు దోషి భార్యే అని తేలింది. ఆమె హత్య చేసినట్లు గుర్తించారు. వీరన్న హత్యకు గురవడం తీవ్ర కలకలం సృష్టించింది. ఈ హత్యలో అసలు నిజాలు వెలుగులోకి వచ్చాయి. ప్రియుడితో కలిసి భార్య విజయే భర్తను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. భర్తను హత్య చేసి ఆపై ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించారు. అయితే మృతుడి పేరుపై ముందే రూ.10 లక్షలు ఇన్స్యూరెన్స్ చేయించారు భార్య విజయ, ఆమె ప్రియుడు ఆర్ఎంపి డాక్టర్ భరత్. ఈ కారణంగానే భర్తను దారుణంగా హత్య చేసినట్లు విచారణలో పోలీసులు తేల్చారు. మరోవైపు వీరన్న హత్యతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మృతుడి బంధువులు గ్రామంలో ఆందోళనకు దిగారు. వీరన్న హత్యకు కారకుడైన ఆర్ఎంపీ వైద్యుడు భరత్‌కు చెందిన రేకుల షెడ్డును ధ్వంసం చేశారు. అంతేకాకుండా ఓ బైక్‌ను కూడా మృతుడి బంధువులు దహనం చేశారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు గ్రామంలోకి చేరుకుని వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నిస్తున్న పరిస్థితి. తమకు న్యాయం కావాలంటూ వీరన్న బంధువులు డిమాండ్ చేస్తున్నారు. ■

# ఎపి ప్రభుత్వం కీలక నిర్ణయం

అమరావతి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ వ్యాప్తంగా ఈనెలాఖరు నుంచి సమగ్ర కుటుంబ సర్వే చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రతి కుటుంబం వివరాలు సేకరించనుంది. ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా సమగ్ర సర్వే నిర్వహణ చేయనుంది. సంక్షేమ పథకాలు, ప్రభుత్వం అందించే ప్రయోజనాలు అమలు కోసం ఈ సర్వే చేయనుంది.రాష్ట్రంలోని ప్రతి ఇంటి వివరాలు ప్రభుత్వ రికార్డుల్లో ఖచ్చితంగా నమోదు చేసేలా చూడటం ఈ సర్వే లక్ష్యం. అర్హులైన అన్ని కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు, సేవలను సకాలంలో అందించడానికి ఈ సర్వే చేస్తోంది. అలాగే ఈ సర్వే ద్వారా ప్రజాసేవల పంపిణీ సామర్థ్యాన్ని మెరుగుపరచనుంది. డిసెంబర్ నెల చివరి వారం నుంచి ఏకీకృత కుటుంబ సర్వే ప్రారంభం కానుంది. గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామ సచివాలయాలు, పట్టణ ప్రాంతాల్లోని వార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఈ సర్వే చేయనున్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబ ప్రస్తుత పరిస్థితిని ధ్రువీకరించడానికి, నవీకరించడానికి ప్రభుత్వ సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాల నుంచి అర్హత కలిగిన ఏ కుటుంబం లేదా వ్యక్తి తప్పించుకోకుండా చూడటమే ఈ సర్వే ముఖ్య లక్ష్యం. ఖచ్చితమైన నూతనంగా తీసుకున్న కుటుంబ రికార్డులు ప్రభుత్వ ధ్రువపత్రాలు, ఆమోదాలను జారీ చేయడానికి సమయం ఆదా అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సర్వే ద్వారా వచ్చిన సమాచారం ఆధారంగా అన్ని విభాగాల్లో అనవసరంగా ఉన్న వాటిని ధ్రువీకరించాల్సిన అవసరం ఉండదు. ప్రభుత్వ సమాచారం ఖచ్చితత్వం, పరిపూర్ణతను మెరుగుపరచడం ఈ సర్వే ముఖ్య ఉద్దేశ్యం. కుటుంబ వివరాలను నేరుగా ఇంటి దగ్గర నవీకరించడం ద్వారా ప్రభుత్వ విధానాలను, పథకాలను మరింత సమర్థవంతంగా ప్లాన్ చేసి అమలు చేసే అవకాశం ఉందని అనుకుంటుంది. సర్వే నిర్వహించడం ద్వారా భవిష్యత్తు సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనను మెరుగుపరచడానికి అవకాశం ఉంటుందని భావిస్తోంది. ప్రభుత్వ సిబ్బంది ఈ సర్వేను ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా నిర్వహించనున్నారు. తద్వారా సమాచారం త్వరగా, ఖచ్చితంగా నమోదు చేయనున్నారు. సాధ్యమైన ప్రాంతాల్లో ఇప్పటికే నమోదైన రికార్డులను, సమాధానాలను ముందస్తుగా పూర్తి చేయడానికి ఉపయోగిస్తారు. తద్వారా ప్రతి కుటుంబానికి పట్టే సమయం తగ్గనుంది. ఆధార్ ప్రామాణీకరణను ఉపయోగించి గుర్తింపు ధ్రువీకరణను సురక్షితంగా నిర్వహిస్తారు. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని కాపాడుతూ రికార్డులు సరైనవని నిర్ధారించనుంది. ప్రభుత్వ పాలన మరింత పారదర్శకంగా పని చేసేందుకు ఈ సర్వే ఉపయోగపడనుంది. పౌర కేంద్రీకృత పాలన దిశగా ఏకీకృత కుటుంబ సర్వే ఒక ముఖ్యమైన అడుగుగా ప్రభుత్వం అనుకుంటుంది. సర్వేయర్లకు ఖచ్చితమైన సమాచారాన్ని అందించడం ద్వారా, పౌరులు తమ కుటుంబ వివరాలు అలాగే ఉన్నాయని, వారు ప్రభుత్వ సేవలను సజావుగా పొందుతున్నారని నిర్ధారించుకోవడంలో సహాయపడుతుంది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సేవల పంపిణీని మెరుగుపరచడానికి, జీవన నాణ్యతను పెంచడానికి డిజిటల్ టెక్నాలజీ, ప్రజా – స్నేహపూర్వక విధానాలను ఉపయోగించేందుకు ఈ సర్వే ఉపయోగపడనుంది.

# అక్రమవసలదారులకు ట్రంప్ గాలం

వాషింగ్టన్,అక్రమ వలసదారులను దేశం నుంచి పంపించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్న ట్రంప్ యంత్రాంగం.. వారికి గతంలో ప్రకటించిన ఓ ఆఫర్‌ను భారీగా పెంచింది. అమెరికా వీడేందుకు అంగీకరించిన వారికి ఇస్తామన్న స్టైఫండ్‌ను మూడు వేల డాలర్లకు పెంచినట్లు పేర్కొంది. స్వదేశానికి వెళ్లిపోయేందుకు ఉచితంగా విమాన ప్రయాణ సదుపాయానికి ఇది అదనమని తెలిపింది. ఈ హాలీడే ఆఫర్ ఈ ఏడాది చివరి వరకు మాత్రమేనని సోషల్ మీడియాలో ఓ ప్రకటన చేసింది.డీహెచ్ఎస్ ప్రకారం ఈ ఏడాది జనవరి నుంచి 19లక్షల మంది అక్రమ వలసదారులు స్వచ్ఛందంగా దేశాన్ని వీడిపోయారని సమాచారం. వీరిలో కొన్ని వేల మంది సీబీపీ హోమ్ యాప్‌ను వినియోగించు కున్నట్లు తెలిసింది. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తొలి ఆరు నెలల్లోనే 1.5లక్షల మందిని బహిష్కరించగా.. దాదాపు 13వేల మంది స్వచ్ఛందంగా వెళ్లిపోయినట్లు తెలిసింది. అయితే, ఈ గణాంకాలకు సంబంధించి అధికారిక సమాచారం వెలువడలేదు. అక్రమ వలసదారులపై కొరడా ఝుళిపిస్తున్న ట్రంప్ యంత్రాంగం.. వందలాది మందిని అరెస్టు చేస్తోంది. అనంతరం వారిని నిర్బంధ కేంద్రాలకు తరలిస్తోంది. ఈ క్రమంలో స్వచ్ఛందంగా అమెరికా వీడాలనుకునే వారికి ప్రోత్సాహకంగా వెయ్యి డాలర్లు ఇస్తామని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఈ ఏడాది మేలో ప్రకటించింది. ఇందుకోసం కస్టమ్స్ అండ్ బార్డర్ ప్రొటెక్షన్ హోమ్ యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించింది. అటువంటి వారిని నిర్బంధించాల్సిన అవసరం లేకుండా చూస్తామని, బలవంతంగా స్వదేశానికి తరలించాల్సిన జాబితా నుంచి తొలగిస్తామని పేర్కొంది. అంతేకాదు వారిపై విధించిన జరిమానాలపైనా మినహాయింపు ఇస్తామని చెప్పింది. ప్రభుత్వం అందిస్తోన్న ఈ ప్రత్యేక ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోని అక్రమ వలసదారులకు అరెస్టు, బహిష్కరణ మాత్రమే మార్గమని డీహెచ్ఎస్ అధికారులు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు అటువంటి వారికి అమెరికాకు మళ్లీ తిరిగి వచ్చే అవకాశమే ఉండదని స్పష్టం చేస్తున్నారు.

# హెచ్-1బీ వీసా ఎంపిక పక్రియలో కీలక మార్పులు

వాషింగ్టన్,విదేశీ ఉద్యోగులకు ఇచ్చే హెచ్-1బీ వీసా ఎంపిక పక్రియలో కీలక మార్పులకు అమెరికా ఇప్పటికే సిద్ధమైంది. దీనికి సంబంధించి హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ ఇప్పటికే ప్రతిపాదనలు రూపొందించగా.. వాటిపై తుది సమీక్ష మొదలైంది. నైపుణ్యం, వేతనాల ఆధారిత లాటరీ వ్యవస్థ కోసం రూపొందించిన నిబంధనలను 'ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్' సమీక్షిస్తోంది. ఈ మేరకు ఇమిగ్రేషన్ సంస్థ ఫ్రాగోమెన్ నివేదికను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి.నిపుణులైన కార్మికులు మాత్రమే దేశంలోకి వచ్చేలా, అమెరికన్లకు ప్రాధాన్యం కల్పించేలా అగ్రరాజ్యం ఈ కొత్త మార్పులు తీసుకురానుంది. ప్రస్తుతం హెచ్-1బీ వీసాల జారీకి కంప్యూటరైజ్డ్ లాటరీ విధానాన్ని అనుసరిస్తుండగా.. ఇకపై వెయిటెడ్ సెలక్షన్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టనున్నారు. దీని ప్రకారం.. ఉద్యోగి వేతన స్థాయిని అనుసరించి రిజిస్ట్రేషన్‌లో ప్రాధాన్యం కల్పించడం, వేతన వర్గీకరణ ఆధారంగా దరఖాస్తులను విభజించడం వంటివి చేయనున్నారు. అంటే.. ఇకపై అధిక వేతనం కలిగిన ఉద్యోగులకు హెచ్-1బీ వీసాలు ఎక్కువగా దక్కే అవకాశం ఉంది. ఫెడరల్ నిబంధనల మార్పుల పక్రియలో ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ సమీక్షను చివరిదశగా పరిగణిస్తారు. ఇక్కడ ఆమోదం పొందిన తర్వాత నిబంధనలు ఖరారు చేసి వాటిని ప్రకటిస్తారు. వీలైనంత త్వరగా ఈ రివ్యూను పూర్తి చేసి తుది నిబంధనలకు సంబంధించిన అడ్వాన్స్ కాపీని త్వరలోనే విడుదల చేయనున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది నుంచే హెచ్-1బీ వీసాల జారీకి ఈ కొత్త నిబంధనలను అమలుచేయాలని అమెరికా సర్కారు భావిస్తోంది. అయితే, దీనిపై ఇంకా అధికారిక ప్రకటనేదీ వెలువడలేదు.

# కృష్ణా జలాల వాటాలపై బీఆరెస్,కాంగ్రెస్ షాడో ఫైటింగ్!




హైదరాబాద్,గత రెండు రోజులుగా టీవీ చానళ్లలో, పత్రికల్లో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై అటు బీఆరెస్ నాయకులు, ఇటు కాంగ్రెస్ నాయకులు పోటాపోటీగా విమర్శలు చేసుకుంటున్నారు. మీరేం చేశారని ఒకరు ప్రశ్నిస్తే.. మీరు చేసింది ఏంటని మరొకరు దుమ్మెత్తుతున్నారు. నిజానికి కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా 299 టీఎంసీలు. అది తాత్కాలిక వాటా అయినా, శాశ్వత వాటా అయినా మొత్తానికి ఖరారు చేసిన కేటాయింపులే. కానీ.. చట్టపరంగా దక్కిన ఈ నీటి వాటాను వినియోగించుకోవడంలో తెలంగాణ పాలకులు పూర్తిగా విఫలమయ్యారని సాగునీటిపారుదల నిపుణులు అంటున్నారు. తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు.. మీ పాలన తప్పంటే%ౌ% మీ పాలనే తప్పంటూ ఒకరిపై మరొకరు ఘాటు విమర్శలు చేసుకుంటూ ప్రజలను పిచ్చివాళ్లను చేస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కృష్ణా జలాల వాడకం విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య షాడో ఫైట్ నడుస్తోందని అంటున్నారు.2014-15 నీటి సంవత్సరం నుంచి 2024-25 నీటి సంవత్సరం వరకు ఏ ఒక్క ఏడాది కూడా తమకు కేటాయించిన జలాల్లో కనీసం 90 శాతం కూడా తెలంగాణ వినియోగించుకోలేదు. 2016-17 నీటి సంవత్సరంలో మాత్రమే 45.50 శాతం నీటిని వినియోగించుకున్నారు. ఇంకో విచిత్రమైన విషయం ఏమంటే.. ఏపీ పాలకులు ఏ ఒక్క నీటి సంవత్సరంలో కూడా 54.5 శాతానికి తక్కువ కాకుండా జలాలను సద్వినియోగం చేసుకుని ముందు వరుసలో ఉన్నారు. తద్వారా పచ్చటి పైర్లతో రైతులకు చేతినిండా పని కల్పిస్తున్నారు.కృష్ణా నదిలో నీటి లభ్యత ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల నీటి కేటాయింపులు తాత్కాలికంగా చేశారు. కేటాయింపులపై ఇప్పటికీ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌లో విచారణ కొనసాగుతున్నది. ఈ కేసు విషయాన్ని పక్కన పెడితే.. అసలు కేటాయింపుల ప్రకారం తెలంగాణ పాలకులు చర్యలు తీసుకున్నారా అంటే లేదనే సమాధానమే సర్వత్రా విన్పిస్తున్నది. ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావం తరువాత 2014%-%15 నీటి సంవత్సరంలో మొత్తం టీఎంసీలు 757.073 కాగా ఏపీ పాలకులు 529.330 టీఎంసీలు (69.91 శాతం) వాడుకోగా, తెలంగాణ 227.743 టీఎంసీలు (30.09 శాతం) వినియోగించుకున్నది.కేటాయించిన దాని కన్నా ఎక్కువగా వినియోగించుకునేందుకు ఏపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున సాగునీటి ప్రాజెక్టులను చేపట్టింది. కానీ.. తెలంగాణలో మాత్రం పాలమూరు రంగారెడ్డి సహా కీలక పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించారని సాగునీటి నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో బాహుబలి మోటర్లను ఏర్పాటు చేశామని చెప్పుకొంటున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. ఆ మోటర్లు ఎత్తిపోసే నీటిని పారించేందుకు కాలువలు, ఫీడర్ చానళ్లను పట్టించుకోలేదని అంటున్నారు. వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పుకొంటున్న కేసీఆర్.. ఆయకట్టు వరకు నీరు పంపించకుండా ప్రాజెక్టు నిర్మించి లాభమేంటని రైతులు ప్రశ్నిస్తున్నారు.రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కృష్ణా నది జాలాల వినియోగం విషయంలో చిత్తశుద్ధితో పని చేయడం లేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే రెండేళ్ల కాలం గడిచిపోయింది. ఈ రెండేళ్ల వ్యవధిలో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ఎంతో చేయాల్సి ఉండగా, కొత్త ప్రాజెక్టుల సంగతి పక్కన పెడితే.. పెండింగ్ ప్రాజెక్టులను సైతం గాలికి వదిలేశారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. భీమా (20 టీఎంసీలు), నెట్టెంపాడు (21.425 టీఎంసీలు), కల్వకుర్తి (40 టీఎంసీలు) ఇంకా పూర్తి కాలేదు. నల్లగొండ జిల్లా రైతులకు జీవనాడిగా మారాల్సిన శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్సెఎల్బీసీ) ఇంకా పూర్తి కాలేదు. 2027 నాటికి పూర్తి చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. 2.70 లక్షల ఎకరాల ఆయకట్టుకు, 516 గ్రామాలకు తాగునీరు అందించే ఎస్సెఎల్బీసీ విషయాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు పదేళ్ల పాటు పట్టించుకోకపోవడంతో పనులు పూర్తి కాలేదని నల్లగొండ జిల్లా రైతులు ఆరోపిస్తున్నారు. ఇక పోతే శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి 30 టీఎంసీల వరద నీటిని ఎత్తిపోసే భారీ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు డిండి. నల్లగొండ, మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల్లోని ఫ్లోరోసిస్, కరువు పీడిత ప్రాంతాలైన ఒక వేయి గ్రామాలకు తాగునీరు, 3.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే దీని లక్ష్యం. 2015లో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. జూరాల వద్ద కృష్ణా నది నుంచి 70 టీఎంసీల నీటిని ఎత్తిపోయడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. వర్షాకాలంలో 60 రోజుల పాటు వరద ఉండే రోజుల్లో రూ.1.5 టీఎంసీల చొప్పున మొత్తం 90 టీఎంసీలను ఎత్తిపోయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఒక్క డిస్ట్రిబ్యూటరీ కాలువ నిర్మించకుండా, ఒక్క ఎకరాకు నీరు ఇవ్వకుండా 90 శాతం పనులు పూర్తయ్యాయని బీఆర్ఎస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకున్నదని కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తున్నారు. దీనికి రూ.27వేల కోట్లు ఖర్చు చేసి 35 శాతం పనులు మాత్రమే పూర్తి చేశారన్నారు. ఈ ప్రాజెక్టులను పూర్తి చేస్తే సుమారు 200 కు పైగా టీఎంసీలను వాడుకునే అవకాశం ఉంటుంది.తెలంగాణలో కృష్ణా జలాలను పూర్తిగా వినియోగించుకునేందుకు పెద్ద ఎత్తున నిధులు సమకూర్చుకుని ముందుకు వెళ్లాల్సి ఉండగా, ఆ దిశగా పని చేస్తున్న సూచనలు ఏమాత్రం కన్పించడం లేదు. ఈ ప్రభుత్వం పని చేసేందుకు మరో రెండేళ్ల గడువు మాత్రమే మిగిలి ఉంది. మాజీ ముఖ్యమంత్రి కృష్ణా జలాల పై చేసిన విమర్శలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి విమర్శలు చేయడం మినహా ఏమీ చేయడం లేదనేది ప్రజలకు తెలిసిపోయింది. ఇకనైనా మాటలకు పరిమితం కాకుండా పాలమూరు రంగారెడ్డితోపాటు.. ఇతర పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని సాగునీటి నిపుణులు చెబుతున్నారు. ఈ పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసుకుంటే సుమారు 300 టీఎంసీల నీళ్లు అందుబాటులోకి వస్తాయని గుర్తు చేస్తున్నారు. అది వదిలేసి, ఒకరిపై ఒకరు నెపం మోపుకోవడం, జలదోపిడీ అంటూ ఏపీపై పడి ఏడవటం వల్ల ఉపయోగం ఏమీ ఉండబోదని స్పష్టం చేస్తున్నారు. నిజానికి తెలంగాణ 299 టీఎంసీల నీటిని కేటాయించినా.. తగిన ప్రాజెక్టులు లేక వాటిని వాడుకునే అవకాశం దక్కలేదని చెబుతున్నారు. గత ఏడాది కాలం మంచిగా కావడంతో వాడుకునే అవసరమూ రాలేదని అంటున్నారు. ఈ కీలక అంశాలను పక్కన పెట్టి.. అధికార, ప్రతిపక్ష పార్టీలు షాడో ఫైట్ చేస్తున్నాయని విమర్శిస్తున్నారు.

# అడ్డగోలుగా బిల్లుల ఆమోదమా?



న్యూఢిల్లీ,పార్లమెంట్‌లో బిల్లులను ప్రవేశపెట్టినప్పుడు దానిపై సమగ్రంగా చర్చ జరగాలి. ఇంకా సంబంధిత శాఖలకు చెందిన పార్లమెంటరీ స్థాయి సంఘాల పరిశీలనకు పంపాలి. ఆయా కమిటీలు ప్రజా సంప్రదింపుల ద్వారా ప్రజలు, నిపుణులు, వివిధ వర్గాల అభిప్రాయాలను సేకరించిన తర్వాత వాటిని సమీక్షించి నిగ్గు తేలుస్తాయి. ఈ ప్రజా సంప్రదింపులు అనేవి శాసన ప్రక్రియలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంచడానికి, చట్టాల రూపకల్పనలో పౌరుల భాగస్వామ్యాన్ని నిర్ధారించడానికి అనుసరించే ప్రజాస్వామ్య పద్ధతి. కానీ ఈనాడు పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టిన బిల్లుల విషయంలో ఈ విధమైన ప్రజా సంప్రదింపులు అనేవి ఎంతవరకు జరుగుతున్నాయన్నది ప్రశ్నార్థకమే. పార్లమెంట్ చర్చలతో కానీ, స్థాయి సంఘాల పరిశీలనతో కానీ నిమిత్తం లేకుండా కేవలం మూజువాణీ ఓటు ద్వారా బిల్లులను ఆమోదింప చేసుకునే ఏకపక్ష పోకడను ఏమనాలి? పార్లమెంట్ సభ్యులు దీనిపై నిలదీసినా పట్టించుకోని అడ్డగోలు విధానం ఇప్పుడు సాగుతోందనడానికి అనేక సాక్షాలు కనిపిస్తున్నాయి.వాయనాడ్ ఎంపి ప్రియాంకగాంధీ డిసెంబర్ 17న వికసిత్ భారత్ గ్యారంటీ (విబిజిరామ్‌జి)అనే కొత్త ఉపాధి పథకానికి సంబంధించిన బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినప్పుడు దీనిని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ పరిశీలనకు పంపాలని లోక్‌సభకు సూచించారు. ఈ బిల్లు నమూనా ఆ రోజు సాయంత్రం 5 గంటలకు పార్లమెంట్ సభ్యుల పోర్టల్ లోకి, అందుబాటు లోకి రాగా, 5 45 గంటలకే సవరణలు కోరడమైంది. ఇంత హడావిడిగా సూచనలు కోరడం ఇదేం పద్ధతి? అని విపక్ష సభ్యులు నిలదీశారు. మొదటిసారి ఈ బిల్లును చదివి అర్థం చేసుకోవడానికి కనీసం ఒక రోజైనా ముందుగా తమకు అందజేయడం సంప్రదాయం కాదా? అని ఆక్షేపించారు. ఈ అభ్యంతరాలన్నీ గాలిలో పేలపిండిలా కొట్టుకుపోయాయి. మూజువాణీ ఓటుతో డిసెంబర్ 18 నే బిల్లు ఆమోదం పొందడం గమనార్హం. ఉపాధి పథకం అన్నది మనకున్న చట్టాల్లో అతి ముఖ్యమైనది. అది పూర్తిగా రద్దు కావడం ఎందుకో మనకు తెలియదు. బిల్లులను ప్రవేశపెట్టడం, వాటిలో ఏముందో చర్చించడానికి అవకాశం ఇవ్వకుండా, సంబంధిత స్థాయి సంఘాల పరిశీలన లేకుండా గుత్తాధిపత్యంతో బిల్లులను ఆమోదింప చేసుకోవడం మోడీ సర్కారు లోనే నిత్యకృత్యమవుతోంది.2004-2009 వరకు 14వ లోక్‌సభ కాలంలో బిల్లుల్లో 60 శాతం స్థాయి సంఘాల పరిశీలనకు పంపడమైంది. 2009 14 కాలంలో ఈ సంఖ్య 71% అయింది. మోడీ పగ్గాలు చేపట్టిన మొదటి ప్రభుత్వ కాలంలో ఇది 25 శాతానికి పడిపోయింది. మోడీ రెండోసారి ప్రభుత్వ (201924) కాలంలో ఇది 16 శాతానికి దిగజారింది. అంటే ఇదంతా కేవలం నిర్లక్షంగా ఉద్దేశపూర్వకంగా జరుగుతోందన్న అభిప్రాయం కలుగుతోంది. ఇదే విధంగా సమాచార హక్కు చట్టం కూడా సంబంధిత స్థాయి సంఘం పరిశీలన లేకుండా 2019లో సవరణలో చోటుచేసుకున్నాయి. ఫలితంగా ప్రపంచస్థాయిలో సమాచార హక్కు కల్పనలో భారత్ ర్యాంక్ 8 కి, తరువాత 9 కి పడిపోయింది. బిల్లులను ఈ విధంగా జబర్దస్తీగా ఆమోదింప చేసుకోవడంపై 2019లో తెలుగుదేశం, కాంగ్రెస్, సమాజ్‌వాది, బహుజనసమాజ్, సిపిఎం తదితర పార్టీల ఎంపిలంతా పార్టీలకు అతీతంగా ప్రభుత్వంపై తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. ప్రజా సంప్రదింపుల ద్వారా అభిప్రాయాలను సేకరించి లిఖిత పూర్వకంగా ప్రభుత్వానికి తెలియజేశారు. అయినా కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. 2020 సెప్టెంబర్ 20న లోక్‌సభలో ఆమోదించిన ఆర్డినెన్సులు రాజ్యసభలో మూజువాణీ ఓటు ద్వారా ఆమోదం పొందాయి. డివిజన్ ఓటు పద్ధతి అమలు చేయాలని సభ్యులు డిమాండ్ చేసినా ఆనాడు రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ దానిని గుర్తించలేదు. రాజ్యసభ టివి ప్రత్యక్ష ప్రసారాలు బంద్ చేశారు. ఎంపిల మైక్రోఫోన్లు స్విచాఫ్ చేశారు. మొత్తం మీద సభ్యుల ఎస్ లేదా నో అనే డివిజన్ ఓటు లేకుండానే ఆర్డినెన్సులను ఆమోదింప చేసుకున్నారు. ఈ చిట్కాయే బిజెపి తరువాత అనుసరించడం ప్రారంభించింది.కర్ణాటకలో ఆనాటి బిజెపి ప్రభుత్వం గోవధ వ్యతిరేక బిల్లును మూజువాణీ ఓటుతోనే ఆమోదింప చేసుకుంది. కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను కూడా ఇదే విధంగా అమలులోకి తెచ్చింది. రైతులకు క్షేత్రస్థాయిలో ఎంతవరకు వీటివల్ల ప్రయోజనం కలుగుతుందో అన్న పరిశీలనకు అవకాశం ఇవ్వలేదు. పార్లమెంట్‌లో విపక్షాలు అరచిగీ పెట్టినా పట్టించుకోలేదు. ఇప్పుడు ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన కొత్త ఉపాధి పథకం కోట్లాది మంది భారతీయులపై విపరీత ప్రభావం చూపిస్తాయని కాంగ్రెస్‌తో సహా విపక్షాలన్నీ ఏకగ్రీవంగా నిరసిస్తున్నాయి. ఈ చట్టాలపై ప్రజల స్పందన ఏమిటో తెలుసుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నించడం లేదు. ప్రవేశపెట్టిన చట్టాలన్నీ గొప్పవే అని చెప్పలేం. అలాగే వాటిని పరిశీలించకుండా లోపాలను సవరించకుండా అమలులోకి తీసుకువచ్చినా తగిన ప్రయోజనం ఉండదు. భవిష్యత్ పరిణామాలు ఎలా ఉంటాయో అన్న ఆలోచన లేకుండా చట్టాలను అమలు చేయడం సాధ్యం కాదని స్పష్టమైనప్పుడు ప్రభుత్వం తన అహంకార ధోరణిని విడిచిపెట్టి ఆ చట్టాలను విరమింప చేసుకోవడం ఉత్తమం. అలాంటి సందర్భాల్లో ప్రజలకు క్షమాపణ చెప్పి వెనక్కు తగ్గడం సముచితం. తాము తప్ప మరెవరూ ఈ దేశాన్ని ముందుకు ప్రగతి పథంలో నడిపించలేరని, తమకు ప్రజలే అపరిమిత శక్తిని బహుమతిగా ఇచ్చారని విశ్వసించడం శుద్ధ అవివేకం, ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదం అవుతుందనడంలో సందేహం లేదు.

## అండర్ గ్రౌండ్ కేబుల్‌పై పిల్..కొట్టివేసిన హైకోర్టు

అమరావతి,ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ ఏర్పాటు కోసం ఖరారు అయిన టెండర్ పై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఆ పిల్‌ను విచారించిన హైకోర్టు కొట్టేసింది. నోటిఫికేషన్ జారీ చేసిన ఏడాది తరువాత అందులోని నిబంధనలను సవాల్ చేయడం ఏమిటని పిటిషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. ఎల్ 1గా నిలిచిన బీఎస్సార్ సంస్థతో పాటు మొత్తం మూడు సంస్థలు బిడ్డింగ్‌లో పాల్గొన్నాయని ధర్మాసనం గుర్తుచేసింది ఎల్ 1గా నిలిచిన బీఎస్సార్ ఇన్‌ఫ్రాటెక్‌కు టెండర్ కేటాయిస్తే తప్పేముందని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వం తరుపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. పిటిషనర్ తరుపున న్యాయవాది మెట్ల చంద్రశేఖర్ వాదించారు.

# అందరిలోనూ క్వాంటమ్ టెక్నాలజీపై ఆలోచన

అమరావతి, ప్రస్తుతం అందరూ క్వాంటమ్ టెక్నాలజీ గురించే ఆలోచిస్తున్నారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఆధునిక పరిశోధల కేంద్రంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఉంటుందని చెప్పారు. వేలాది టెక్ విద్యార్థులతో ఆన్‌లైన్‌లో 'క్వాంటమ్ టాక్' నిర్వహించిన సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. అన్ని రంగాల్లోనూ క్వాంటమ్ కంప్యూటింగ్ పనిచేయబోతోందన్నారు. క్యూబిట్, వైసర్ సంస్థలతో కలిసి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 1970లో చైనా ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చింది. 1991లో భారత్‌లో ఆ సంస్కరణలు వచ్చాయి. ఆ తర్వాత ఎక్కడా వెనక్కి తిరిగి చూడలేదు. వ్యవసాయ రంగంలో సంస్కరణలతో ఆర్థికాభివృద్ధికి ముందడుగు పడింది. హరిత విప్లవంతో దేశ స్థితిగతులు సమూలంగా మారాయి. ఆహార ధాన్యాల విషయంలో భారత్ స్వయం సమృద్ధి సాధించింది. సామాన్యుల సాధికారతే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం సంస్కరణలు తీసుకొస్తోంది. విశాఖకు చాలా ఐటీ కంపెనీలు వస్తున్నాయి. భవిష్యత్తులో నాలెడ్జ్ ఎకానమీ, టెక్నాలజీకి ఆ నగరం చిరునామాగా మారబోతోంది. తిరుపతిలో స్పేస్ సిటీ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాం అని చంద్రబాబు వివరించారు.సక్సెస్ అయిన ఫార్ములానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మళ్లీ తెరపైకి తీసుకువచ్చారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఐటీని ప్రమోట్ చేస్తూ ఎలాంటి ప్రణాళికలు రచించారో... ఇప్పుడు క్వాంటం, ఏఐను ప్రమోట్ చేయడానికి అదే స్ట్రాటజీని అవలంభిస్తున్నారు. అంతర్జాతీయంగా మారుతున్న పరిణామాలు, జాతీయ స్థాయిలో తీసుకున్న పాలసీలను అందిపుచ్చుకునేలా ఏపీ యువతను ముఖ్యమంత్రి సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఐటీ కంపెనీలకు అవసరమైన నిపుణులను, ఉద్యోగులను అందించేందుకు పెద్ద ఎత్తున ఇంజనీరింగ్ కాలేజీలను చంద్రబాబు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు విభజిత ఏపీలో క్వాంటం, ఏఐ, డీప్ టెక్ కంపెనీలకు అవసరమైన నైపుణ్యం ఉన్న హ్యూమన్ రిసోర్సెస్‌ను బిల్డప్ చేస్తున్నారు. ఓవైపు క్వాంటం, ఏఐ, డీప్ టెక్ కంపెనీలను రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానిస్తూనే... మరోవైపు ఏఐ, క్వాంటం నిపుణులుగా యువతను సిద్ధం చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఏపీ నుంచి 50 వేల మంది ఏఐ, క్వాంటం నిపుణలను తీర్చిదిద్దేలా సీఎం ప్రణాళికలు రూపొందిస్తున్నారు. విశాఖను ఏఐ హబ్, అమరావతిని క్వాంటం వ్యాలీగా రూపొందించేందుకు కసరత్తు ముమ్మరం చేశారు. హైదరాబాద్ డెవలప్‌మెంట్ కోసం ఉమ్మడి రాష్ట్రంలో తాను అనుసరించిన పాలసీనే ఏపీ డెవలప్‌మెంట్ కోసం సీబీఎన్ మళ్లీ అమలు చేస్తున్న పరిస్థితి. రాష్ట్రంలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏఐ, క్వాంటం నిపుణులను అందించేలా ఏపీలో ఎకో సిస్టంను చంద్రబాబు తయారు చేస్తున్నారు. మరికొన్ని నెలల్లో ఏపీకి క్వాంటం కంప్యూటింగ్ మెషిన్ రానుంది. మరో ఎనిమిది నెలల్లో క్వాంటం వ్యాలీలో క్వాంటం టవర్లు సిద్ధం కానున్నాయి. ప్రణాళికల్లో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా టెక్ స్టూడెంట్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద ఎత్తున క్వాంటం టాక్ నిర్వహించారు. చంద్రబాబు నిర్వహించిన క్వాంటం టాక్ కార్యక్రమంలో టెక్ స్టూడెంట్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ అభిప్రాయాలను, ఆలోచనలను సీఎం చంద్రబాబుతో పంచుకున్నారు. క్వాంటం, ఏఐ రంగాలను ఏపీలో ఎలా అభివృద్ధి చేయాలనే అంశంపై విద్యార్థులకు సీఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పాలసీలు, అభివృద్ధి కార్యక్రమాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులు, యువత ఆలోచన చేయాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సూచించారు.

## జాతీయ భద్రత కోసమేనని కుంటిసాకులు

వాషింగ్టన్, డెన్మార్క్ అధీనంలోని గ్రీన్‌లాండ్ ను కొనుగోలు చేస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో తాజాగా లూసియానా గవర్నర్ జెఫ్ లాండ్రీని గ్రీన్ ల్యాండ్‌కు ప్రత్యేక దూతగా నియమించడంపై విమర్శలు వెల్లువెత్తడంతో ట్రంప్ స్పందించారు. అమెరికాకు జాతీయ భద్రత నిమిత్తం గ్రీన్‌లాండ్ కావాలని.. ఖనిజాల కోసం కాదని అన్నారు. ఈ బాధ్యతను నిర్వర్తించడానికే ప్రత్యేక దూతగా జెఫ్ లాండ్రీని నియమించినట్లు తెలిపారు. యూఎస్‌తో పాటు మిత్ర దేశాల ప్రయోజనాల కోసం ఆయన పని చేస్తారన్నారు. గ్రీన్‌లాండ్‌కు జెఫ్ లాండ్రీని రాయబారిగా నియమించడంపై డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ ఆగ్రహం వ్యక్తం చేశాయి. అమెరికా సహా అన్ని దేశాలతో కలిసి ముందుకు సాగుతామని.. కానీ మా భవితవ్యాన్ని మేమే నిర్ణయించుకుంటామని గ్రీన్‌లాండ్ ప్రధాని ప్రకటించారు. అమెరికాతో సహా ప్రతిఒక్కరూ డెన్మార్క్ రాజ్య ప్రాంతీయ సమగ్రతను గౌరవించాలని డెన్మార్క్ విదేశాంగ మంత్రి పేర్కొన్నారు. డెన్మార్క్‌లో భాగంగా గ్రీన్‌లాండ్ స్వయంప్రతిపత్తి కలిగిన దీవిగా కొనసాగుతోంది. గ్రీన్‌లాండ్‌లో రాగి, లిథియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. బ్యాటరీలు, ఎలక్ట్రిక్ వాహనాల్లో వీటి వినియోగం ఎక్కువగా ఉండటంతో అమెరికా వాటిపై దృష్టిపెట్టింది. 2016లో అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ ట్రంప్ గ్రీన్‌లాండ్ కొనుగోలు ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. హ్యారీ ట్రూమాన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ ఆయన ఈ ద్వీపం కొనుగోలుకు ప్రతిపాదించారు. 100 మిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని ఇచ్చేందుకు సిద్ధమైనప్పటికీ దానిని డెన్మార్క్ తిరస్కరించింది. గ్రీన్‌లాండ్ అమ్మకానికి లేదని, భవిష్యత్తులోనూ అమ్మే ప్రసక్తే లేదని ఆ దేశ ప్రధాని మ్యూట్ బౌరప్ ఎగిడే ఇటీవల మరోసారి స్పష్టంచేశారు. అయినప్పటికీ అమెరికా తన తీరు మార్చుకోవట్లేదు. తన ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంది.

## న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు

హైదరాబాద్,నూతన సంవత్సరం సందర్భంగా భాగ్యనగరంలో పలు ఆంక్షలు విధిస్తున్నట్లు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం క్రిస్మస్, వైకుంఠ ఏకాదశి, న్యూ ఇయర్ బందోబస్తుపై టీజీఐసీసీసీలో పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీపీ సజ్జనార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులకు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. నగరంలోని హాట్ స్పాట్లు, నేరప్రాంతాల్లో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. నూతన సంవత్సరం వేడుకల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం నుంచి నగరవ్యాప్తంగా డ్రంకెన్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి 100 ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఉంటాయని.. జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తనిఖీల కోసం 7 ఎ÷-లాటూన్ల అదనపు పోలీస్ బలగాలు మోహరిస్తున్నట్లు వివరించారు సీపీ సజ్జనార్. మద్యం సేవించి వాహనం నడిపితే రూ.10 వేల జరిమానా, 6 నెలల జైలు శిక్షతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ శాశ్వతంగా రద్దు చేస్తామని హెచ్చరించారు. ర్యాష్ డ్రైవింగ్, వీలింగ్, రేసింగ్‌లపై జీరో టాలరెన్స్ ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీలకు వెళ్లేవారు డెసిగ్నేటెడ్ డ్రైవర్ లేదా క్యాబ్ వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. పబ్‌లు, హోటళ్లలో వేడుకలకు డిసెంబరు 31వ తేదీ అర్ధరాత్రి 1 గంట వరకే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు సీపీ సజ్జనార్. శబ్ద కాలుష్య నిబంధనలు ఉల్లంఘిస్తే సౌండ్ సిస్టమ్‌లు సీజ్ చేస్తామని హెచ్చరించారు. గంజాయి, మాదకద్రవ్యాలు, అశ్లీల నృత్యాలకు యాజమాన్యాలదే బాధ్యత అని చెప్పుకొచ్చారు. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# తెలంగాణకు ఎప్పటికీ విలన్ చంద్రబాబేనా.. కేసీఆర్ కు మరో వ్యూహమే లేదా?



హైదరాబాద్,తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన రెండేళ్లకు మీడియా ముందుకు వచ్చిన మాజీ సీఎం కేసీఆర్ ఏపీ సీఎం చంద్రబాబు టార్గెట్ గా చేసిన విమర్శలు చర్చనీయాంశం అవుతున్నాయి. ముఖ్యంగా ఇరురాష్ట్రాల మధ్య నీటి పంపకాలు విషయంలో చంద్రబాబు అన్యాయం చేస్తున్నారని, ఆయన వల్లే ఉమ్మడి పాలమూరు జిల్లా వెనుకబడిపోయిందని కేసీఆర్ చేసిన విమర్శలు రాజకీయ ప్రాధాన్యం సంతరించుకున్నాయని అంటున్నారు. తెలంగాణ రాజకీయాల నుంచి చంద్రబాబు వైదొలగిన 11 ఏళ్ల తర్వాత కూడా ఆయననే లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం వల్ల కేసీఆర్ ఏ ప్రయోజనం ఆశిస్తున్నారనేది ఎక్కువ మంది ప్రశ్నిస్తున్నారు. తాను మళ్లీ గెలవాలంటే చంద్రబాబును బూచిగా చూపాలన్న పాత సిద్ధాంతాన్నే కేసీఆర్ ఇప్పటికీ మేలైన అస్త్రంగా వాడుకోవాలని చూస్తున్నారా? అంటూ చర్చించుకుంటున్నారు.సీఎం చంద్రబాబును వ్యతిరేకిస్తూ సొంత పార్టీ పెట్టిన తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ తో తెలంగాణలో తిరుగులేని నేతగా ఎదిగారు. పదేళ్ల పాటు ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించుకోవడమే కాకుండా.. ప్రత్యేక రాష్ట్రానికి పదేళ్ల పాటు సీఎంగా పనిచేశారు. ఉద్యమ సమయంలో చంద్రబాబును విలన్ గా చూపడం ద్వారా ప్రజల ఆదరాభిమానాలను పొందిన కేసీఆర్.. సీఎంగా గెలిచిన తర్వాత కూడా చంద్రబాబును టార్గెట్ చేయడం ద్వారా రాజకీయంగా పైచేయి సాధించారని అంటున్నారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ రాజకీయాలకు చంద్రబాబు దూరంగా ఉండిపోయారు. పదేళ్ల పాటు సీఎంగా పనిచేసిన కేసీఆర్.. తానుచేసిన కార్యక్రమాలను ఎక్కువగా ప్రచారం చేసుకోడానికే పరిమితమయ్యారు. దీంతో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబుపై చర్చ లేకుండానే రాజకీయం సాగింది.అయితే ఆ ఎన్నికలు కేసీఆర్ వర్సెస్ రేవంత్ రెడ్డి అన్నట్లు సాగడం, చంద్రబాబు ప్రస్తావన లేకపోవడం వల్ల కేసీఆర్ ఓడినట్లు భావిస్తున్నారని అంటున్నారు. తెలంగాణలో చంద్రబాబు పేరు ప్రస్తావిస్తేనే తనకు రాజకీయంగా మేలు జరుగుతుందన్న ఉద్దేశంతో కేసీఆర్ ఉన్నారని చెబుతున్నారు. అందుకే ఎన్నికలు ముగిసిన రెండేళ్ల వరకు ఆయన ఎలాంటి రాజకీయ ప్రకటనలు చేయలేదని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక చంద్రబాబు శిష్యుడిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రచారం చేసి ఇబ్బందులు సృష్టించాలని చేసిన ప్రయత్నాల వల్ల పెద్దగా ప్రయోజనం లభించలేదని అంటున్నారు. దీంతో మళ్లీ తెలంగాణ రాజకీయ చర్చల్లోకి చంద్రబాబును లాగి.. ఆయన ద్వారా తాను లబ్ధి పొందాలని కేసీఆర్ వ్యూహం రచిస్తున్నారని అంటున్నారు.రెండు రోజుల క్రితం మీడియా ముందుకు వచ్చిన కేసీఆర్.. తన వ్యూహంలో భాగంగానే చంద్రబాబుపై విమర్శలు చేయడానికి ప్రాధాన్యమిచ్చారని అంటున్నారు. అయితే కేసీఆర్ వ్యూహాన్ని పసిగట్టిన ఏపీ సీఎం చంద్రబాబు తెలంగాణలో కేసీఆర్ రాజకీయం కోసం అలా మాట్లాడుతున్నారని, ఆయన మాటలకు ప్రతిస్పందించడం ద్వారా కేసీఆర్ ఉచ్చులోకి వెళ్లకుండా ఉండాలని తన కేడర్ ను అప్రమత్తం చేశారని చెబుతున్నారు. ఈ కారణంగానే మాజీ సీఎం కేసీఆర్ చంద్రబాబుపైన, ఏపీపైన అక్కసు వెళ్లగక్కేలా మాట్లాడినా, టీడీపీ నుంచి ఎవరూ మాట్లాడలేదని విశ్లేషిస్తున్నారు. తాము మాట్లాడి కేసీఆర్ కు ప్రయోజనం కల్పించడం ఎందుకన్న ధోరణిని టీడీపీ నేతలు వ్యక్తం చేయడం చూస్తే.. కేసీఆర్ వ్యూహం అందరికీ తెలిసిపోయిందని అంటున్నారు. ఎలాగైనా వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో పుంజుకోవాలని ఆలోచనతో ఉన్న కేసీఆర్.. అందుకు తగ్గ వ్యూహాలు రచించలేకపోతున్నారా? అని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.

# 'మహా' సంచలనం.. 20 ఏళ్లకు కలసిన 'ఠాక్రేలు'

ముంబై: సుమారు 20 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మహారాష్ట్ర రాజకీయాల్లో ఒక అరుదైన దృశ్యం కనిపించింది. విభేదాలతో విడిపోయిన ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే మళ్లీ ఒక్కటయ్యారు. నేడు (బుధవారం) జరిగిన ఒక భారీ బహిరంగ సభలో ఇద్దరూ కలసి పాల్గొన్నారు. జనవరి 15న జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో శివసేన (ఠాక్రే వర్గం),మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) కలిసి పోటీ చేస్తాయని ప్రకటించారు.

కుటుంబ సభ్యుల సమక్షంలో..

ముంబైలోని ఒక వేదికపై ఇద్దరు సోదరులు తమ కుటుంబ సభ్యులతో కలిసి కనిపించడంతో కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం పెల్లుబికింది. ఈ కలయికను ఉద్దేశించి సీనియర్ నేత సంజయ్ రౌత్ మాట్లాడుతూ, దీనిని ఒక శుభప్రదమైన ప్రారంభంగా అభివర్ణించారు. ముంబై మహానగర పాలక సంస్థ (బీఎంసీ)తో పాటు ఇతర కార్పొరేషన్లపై కాషాయ జెండా ఎగరాలంటే ఈ కలయిక అనివార్యమని ఆయన అన్నారు.

వారసత్వ పోరాటమే స్ఫూర్తి

ఈ సభలో ఉద్ధవ్ ఠాక్రే భావోద్వేగంతో మాట్లాడారు. తమ తాత ప్రబోధన్కర్ ఠాక్రే, తండ్రి బాలాసాహెబ్ ఠాక్రేల ఆశయాల గురించి గుర్తు చేసుకుంటూ, తాము ఇక్కడ కేవలం ఇద్దరు వ్యక్తులుగా కాకుండా ఠాక్రే సోదరులుగా నిలుచున్నామని అన్నారు. శివసేన స్థాపించి 60 ఏళ్లు అవుతున్న తరుణంలో, మరాఠీ ప్రజల ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.



ముంబై రక్షణే పరమావధి

మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే ప్రత్యర్థులపై విమర్శలు గుప్పిస్తూ.. కొందరు నేతలు ముంబైని నాశనం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. తాము విడిపోయి పోరాడితే అది ఇక్కడి అమరవీరులకు చేసే అవమానమవుతుందన్నారు. రాజ్ ఠాక్రే తన ప్రసంగంలో సంఘీభావం చాటారు. వ్యక్తిగత అపార్థాల కన్నా మహారాష్ట్ర గౌరవమే గొప్పదన్నారు. సీట్ల పంపకాల కంటే ముంబై ప్రయోజనాలే తమకు ముఖ్యమని, నాసిక్ వంటి ఇతర కార్పొరేషన్లలో కూడా ఈ పొత్తు కొనసాగుతుందని అన్నారు. కాగా ఈ పొత్తు ద్వారా ముంబై పీఠాన్ని దక్కించుకుంటామని రాజ్ ఠాక్రే ధీమా వ్యక్తం చేశారు.

# కేసీఆర్ తో దోస్తీ.. జగన్ కు మేలేనా!?

హైదరాబాద్,తెలుగు రాష్ట్రాల్లో మాజీ ముఖ్యమంత్రులైన వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి, బీఆర్ఎస్ బాస్ కేసీఆర్ మధ్య బలపడుతున్న బంధం రాజకీయంగా ఆసక్తిరేపుతోంది. ఇద్దరూ ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడే వీరి మధ్య స్నేహ బంధం మొగ్గతొడిగినా.. తాజా పరిణామాల మధ్య ఒకరికొకరు సహకరించుకోవాల్సిన పరిస్థితులతో రాజకీయాలలో ఎటువంటి మలుపులు చోటుచేసుకోనున్నాయనే ఉత్కంఠ రేగుతోంది. ప్రస్తుతం పొత్తు రాజకీయాలకు దూరంగా ఉంటున్న జగన్, కేసీఆర్ భవిష్యత్తులో పొత్తు పెట్టుకుని పనిచేస్తారా? లేక ఒకరికొకరు అండగా నిలుస్తూ ఎవరికి వారే రాజకీయంగా పావులు కదుపుతారా? అనే చర్చ ఎక్కువగా జరుగుతోంది. రెండు రోజుల క్రితం ఏపీ మాజీ సీఎం జగన్ రెడ్డి జన్మదినం సందర్భంగా తాడేపల్లిలో వైసీపీ కార్యాలయం వద్ద వేసిన పోస్టరులో కేసీఆర్, కేటీఆర్ ఫొటోలు పెట్టడం, అదేవిధంగా ఎన్నడూ లేనట్లు హైదరాబాద్ లో కూడా జగన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం కూడా రాజకీయంగా ఆసక్తికరంగా మారిందని అంటున్నారు.తాజా పరిణామాలతో మాజీ సీఎంలు జగన్, కేసీఆర్ మధ్య స్నేహం బలపడిందనే సంకేతాలు కనిపిస్తున్నాయని అంటున్నారు. దాదాపు రెండేళ్ల విరామం తర్వాత మీడియాతో సుదీర్ఘంగా మాట్లాడిన తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్.. తన స్వరాష్ట్రం కన్నా ఏపీ వ్యవహారాలపై ఎక్కువగా మాట్లాడటం కూడా కొత్త సందేహాలకు తావిస్తోందని అంటున్నారు. అయితే ఈ సరికొత్త రాజకీయం వల్ల ఎవరికి ప్రయోజనం అన్న చర్చ జరుగుతోంది. ఏపీలో అధికార పార్టీ టీడీపీని తీవ్రంగా వ్యతిరేకించే కేసీఆర్.. ఎక్కువగా ఏపీ వ్యతిరేక భావ జాలంలోనే రాజకీయాలు చేస్తూ వస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైసీపీని వెనకేసుకు రావడమో లేక ఆ పార్టీని బలపరచడమో వల్లనో కేసీఆర్ కు రాజకీయంగా ఏమైనా ప్రయోజనం ఉంటుందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం తెలంగాణలో రాజకీయంగా ఎదురీదుతున్న బీఆర్ఎస్ దేశంలో తటస్థ రాజకీయాలను ఎంచుకుంది. ఇండి కూటమిలోని కాంగ్రెస్ పార్టీకి విపక్షంగా ఉన్న బీఆర్ఎస్.. అటు బీజేపీకి దగ్గర కాలేకపోతోంది. ఇక మూడో ప్రత్యామ్నాయం కూడా లేక తెలంగాణలో ఒంటరిగా మిగిలిపోయింది.ఇటు ఏపీలో కూడా వైసీపీ ఇదే పరిస్థితి ఎదుర్కొంటోంది. ఎన్డీఏ కూటమి వల్ల అధికారం కోల్పోయిన వైసీపీ.. రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్ తో చేతులు కలిపే సాహసం చేయలేకపోతోంది. అదే సమయంలో రాష్ట్ర విభజనకు కారణమైన బీఆర్ఎస్ పార్టీతో కలిసి నడిచి ప్రయత్నంపైనా తర్జనభర్జన పడుతోందని అంటున్నారు. టీడీపీ వ్యతిరేక భావజాలంతో ఇరుపార్టీల కేడర్ ఒక్కటిగా మాటలు ఆడుతున్నా.. రాజకీయంగా ఎదురయ్యే పరిణామాలను అంచనా వేసిన తర్వాతే.. బీఆర్ఎస్ తో బహిరంగ దోస్తీ చేయాలని పార్టీ నేతలు సూచిస్తున్నారు. పార్టీ అధినేత జగన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వేసిన ఫ్లెక్సీపై రాష్ట్రంలో ఎలాంటి చర్చ జరుగుతోందన్న విషయాన్ని ముందుగా తెలుసుకోవాలని పలువురు సూచిస్తున్నా రు.తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ తన రాజకీయం కోసం ఎవరినైనా వాడుకుం టారని, తెలంగాణ భావజాలాన్ని రగిల్చడానికి ఆయన చంద్రబాబును బూచిగా చూపుతారని అంటున్నారు. ఇదే సమయంలో చంద్రబాబు వ్యతిరేక రాజకీయాలు చేస్తున్న వైసీపీని కేసీఆర్ వాడుకునే ప్రయత్నం చేస్తున్నట్లు చెబుతున్నారు. వైసీపీ ద్వారా కేసీఆర్ కు ప్రయోజనం తప్పితే.. ఆయన ద్వారా వైసీపీకి ఎలాంటి మేలు ఉండదని పార్టీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. మాజీ సీఎం జగన్ రెడ్డితో సత్సంబంధాలు కొనసాగించడం వల్ల తెలంగాణలో రెడ్డి సామాజికవర్గం కేసీఆర్ కు దగ్గరయ్యే పరిస్థితి ఉందని, కానీ, కేసీఆర్ వల్ల ఏపీలో ఏ వర్గం జగన్ కు దగ్గరయ్యే అవకాశం కనిపించడం లేదని అంటున్నారు. అదే సమయంలో రాష్ట్ర విభజనకు కారణంగా కాంగ్రెస్ ను ద్వేషిస్తున్న మాదిరిగానే కేసీఆర్ ను మెజార్టీ ప్రజలు చీదరించుకుంటున్నారని, అది గమనించకుండా కేసీఆర్ రాజకీయ వ్యూహంలో వైసీపీ ఇరుక్కుంటే అసలుకే ప్రమాదం వస్తుందని అంటున్నారు.




# విజయనగరం రాజకీయాల నుంచి బొత్స తప్పుకున్నట్లేనా?



విజయనగరం:గత మూడు దశాబ్దాలుగా విజయనగరం జిల్లాలో రాజకీయంగా చక్రం తిప్పుతున్న సీనియర్ నేత బొత్స సత్యనారాయణ.. వచ్చే ఎన్నికల నాటికి అస్త్రసన్యాసం చేయాలనే ఆలోచన చేస్తున్నారా? అన్న చర్చ జరుగుతోంది. ఇటీవల కాలంలో జిల్లా రాజకీయాల్లో బొత్స వారసులైన కూతురు, కొడుకు సందడి చేస్తుండటంతో బొత్స రిటైర్మెంట్ పై ఊహాగానాలు వ్యాపిస్తున్నాయి. ప్రస్తుతం విశాఖ కేంద్రంగా తన రాజకీయ కార్యకలాపాలు సాగిస్తున్న బొత్స.. సొంత నియోజకవర్గం చీపురుపల్లిని మాత్రం జాగ్రత్తగా కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. గత 30 ఏళ్లలో ఎన్నడూ లేనట్లు ఇప్పుడు చీపురుపల్లిలో జరిగే ప్రతి కార్యక్రమానికి వస్తున్నారు. ఆయన రాలేని పరిస్థితుల్లో కూతురు లేదా కొడుకును పంపిస్తున్నారు. దీంతో బొత్స రాజకీయ వ్యూహంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది.రాజకీయంగా ప్రస్తుతం బొత్స క్రియాశీలంగా ఉన్నా.. వచ్చే ఎన్నికల సమయం నాటికి ఆయన చురుకైన పాత్ర పోషించే పరిస్థితి కనిపించడం లేదని అంటున్నారు. ఈ కారణంగానే ముందస్తుగా వారసులను రంగంలోకి దింపినట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే బొత్స కుటుంబం నుంచి అరడజను మంది జిల్లా రాజకీయాల్లో ఉన్నారు. వీరికి తోడుగా యువతరం కూడా రంగ ప్రవేశం చేయడంతో బొత్స కుటుంబ రాజకీయ కార్యకలాపాలపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రధానంగా సొంత నియోజకవర్గం చీపురుపల్లిలో గత ఎన్నికల్లో ఓడిపోయిన బొత్స.. మళ్లీ అక్కడ నుంచి పోటీకి విముఖత చూపుతున్నట్లు చెబుతున్నారు. తన రాజకీయ జీవితంలో సీఎం తప్ప అని పదవులను అనుభవించిన తాను.. భవిష్యత్తులో రాజ్యసభలో అడుగుపెట్టడం ద్వారా ఆ అనుభవాన్ని సాధించాలని చూస్తున్నారని అంటున్నారు. గత ఎన్నికల సందర్భంగానే పోటీకి దూరంగా ఉండాలని భావించినప్పటికీ పార్టీ అధ్యక్షుడు జగన్ ఒత్తిడితో పోటీ చేయాల్సివచ్చిందని చెబుతున్నారు.ఇక వచ్చే ఎన్నికల నాటికి 70 ఏళ్ల వయసు దాటిపోనుండటం వల్ల పోటీ నుంచి తప్పుకోవాలని బొత్స భావిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే తనకు బదులుగా కొడుకు సందీప్ ను చీపురుపల్లి నుంచి పోటీ చేయించాలని బొత్స డిసైడ్ అయ్యారంటున్నారు. గత ఎన్నికల్లోనే సందీప్ పోటీకి ఉత్సాహం చూపినా పార్టీ చాన్స్ ఇవ్వలేదని అంటున్నారు. అయితే ఇప్పుడు సందీప్ తోపాటు బొత్స కూతురు అనూష కూడా చీపురుపల్లిలో ఎక్కువగా తిరుగుతున్నారు. రాజకీయంగా తన ఆసక్తిని బహిరంగంగా వ్యక్తపరుస్తున్నారు. దీంతో కూతురు, కుమారుడు మధ్య రాజకీయ విభేదాలు రాకుండా కూడా బొత్స ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొద్దిరోజుల వరకు బొత్స స్థానికంగా అందుబాటులో లేని సమయంలో కూతురు లేదా కొడుకు మాత్రమే నియోజకవర్గంలో పర్యటించేవారు. అయితే ఇప్పుడు బొత్స జోక్యంతో ఇద్దరూ ఒకే కార్యక్రమంలో మెరుస్తున్నట్లు వ్యాఖ్యానిస్తున్నారు.బొత్స వారసుడు సందీప్ రాజకీయ ప్రవేశానికి ఇబ్బంది లేకుండా కూతరు అనూషకు ప్రత్యామ్నాయం చూపేలా బొత్స ప్లాన్ చేసినట్లు సమాచారం. కుమారుడు సందీప్ కు తన స్థానంలో చీపురుపల్లి అసెంబ్లీ స్థానం అప్పగించాలని భావిస్తున్న బొత్స.. కుమార్తె అనూషను కూడా అదే నియోజకవర్గం నుంచి జడ్పీటీసీగా పరిచయం చేసి జిల్లా రాజకీయాలలో తిప్పాలని ప్లాన్ చేస్తున్నారని అంటున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలోని గరివిడి జడ్పీటీసీగా అనూషను పోటీకి పెట్టి.. విజయనగరం జడ్పీ చైర్ పర్సన్ అభ్యర్థిగా ప్రకటించేలా బొత్స పావులు కదుపుతున్నారని అంటున్నారు. ప్రస్తుతం విజయనగరం జడ్పీ చైర్మన్ గా బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు ఉన్నారు. ఈయనను వైసీపీ అధిష్టానం భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది. దీంతో మజ్జి శ్రీనివాసరావు అలియాస్ చిన్నశ్రీను వచ్చే స్థానిక ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటారని అంటున్నారు.దీంతో జడ్పీ చైర్పర్సన్ అభ్యర్థిగా బొత్స అనూషను ప్రకటించి కుమారుడికి అడ్డు లేకుండా చేయడంతోపాటు జడ్పీపీఠం తన కుటుంబంలోనే ఉండేలా బొత్స ప్లాన్ చేస్తున్నారని అంటున్నారు. గతంలో కూడా బొత్స సతీమణి బొత్స ఝాన్సీ, అదే కుటుంబానికి చెందిన బడ్డుకొండ అప్పలనాయుడు జడ్పీ చైర్మన్లుగా పనిచేశారు. ఈ నేపథ్యంలోనే బొత్స అనూషను జడ్పీ చైర్ పర్సన్ చేయాలని సత్తిబాబు వ్యూహాలు రచిస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తానికి తాజా రాజకీయ పరిణామాలతో బొత్స వచ్చే ఎన్నికల నాటికి ప్రత్యక్ష ఎన్నికల రాజకీయాల నుంచి తప్పుకునే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు.

# ఈ ఏడాది భారత్ కు కొత్త శత్రుదేశం ?





న్యూఢిల్లీ,అంతర్జాతీయ వ్యవహారాల్లో, ముఖ్యంగా పొరుగుదేశాల విషయంలో తాజాగా భారత్ అనుసరిస్తున్న వైఖరి కారణంగా శత్రువులు పెరిగిపోతున్నారు. గతంలో అమెరికా వంటి దేశాలతో సుదీర కాలం సత్సంబంధాలు కొనసాగించిన భారత్..ఈ ఏడాది మాత్రం ట్రంప్ అధికారంలోకి వచ్చాక వాటిని కొనసాగించడంలో విఫలమైంది. దీని వెనుక ఎన్నో కారణాలు ఉన్నప్పటికీ ఇప్పుడు అమెరికాలో భారతీయులకు చుక్కలు కనిపిస్తున్నాయి. అదే సమయంలో పొరుగుదేశాల్లో మరో కొత్త శత్రువు తయారైంది.భారత్ కు పొరుగుదేశాలైన చైనా, పాకిస్తాన్ ఇప్పటికే ఏకమై శత్రుత్వం కొనసాగిస్తున్నాయి. అదే సమయంలో ఈ ఏడాది అంతర్గంతంగా చోటు చేసుకున్న పరిణామాలపై మరో పొరుగుదేశం బంగ్లాదేశ్ సైతం భారత్ కు శత్రువుగా తయారైంది. ముఖ్యంగా బంగ్లాదేశ్ లో షేక్ హసీనా ప్రభుత్వాన్ని యువత కుప్పకూల్చిన తర్వాత చోటు చేసుకున్న పరిణామాల్లో ఆమెకు భారత్ ఆశ్రయం కల్పించింది. అలాగే ఆమెకు మరణశిక్ష పడ్డాక అప్పగించాలని కోరినా భారత్ అంగీకరించలేదు. దీంతో భారత్–బంగ్లాదేశ్ సంబంధాలు దెబ్బతిన్నాయి.మరోవైపు బంగ్లాదేశ్ లో తాజాగా హిందువులపై అకారణంగా జరుగుతున్న దాడులు సైతం ఇరుదేశాల సంబంధాలకు ఇబ్బందికరంగా మారాయి. ఇప్పటికే బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆశ్రయం ఇస్తున్న భారత్ పై ఆ దేశానికి పీకలదాకా కోపం ఉంది. ఇప్పుడు అక్కడ హిందువులపై దాడులు జరుగుతున్నా ఏమీ అనలేని పరిస్దితుల్లో కేంద్రం స్వదేశంలో తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోంది. అలాగని పూర్తిగా వదిలేయలేని పరిస్దితులు నెలకొన్నాయి. ఇవాళ నిన్న రాత్రి మరో హిందువుపై అల్లరి మూకలు దాడి చేసి చంపేయడం భారత్ ను కలవరపెడుతోంది. ఇప్పటికే ఈ హత్యలపై స్వదేశంలో హిందూ సంఘాల నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.అలా ఈ ఏడాది భారత్ కు చైనా, పాకిస్తాన్ తర్వాత పొరుగున మరో శత్రువు తోడైంది. ఒకప్పుడు పాకిస్తాన్ పై యుద్ధం చేసి మరీ బంగ్లాదేశ్ కు స్వాతంత్రం ప్రసాదించిన చరిత్ర మర్చిపోయి అక్కడి నేతలు ఇప్పుడు భారత్ పై కత్తులు నూరుతున్నారు. అలాగని బంగ్లాదేశ్ పై దాడికి ప్రయత్నిస్తే చైనా, పాకిస్తాన్ మద్దతుగా నిలుస్తాయి. అప్పుడు ఈ ముగ్గురూ కలిసి భారత్ ను ఇబ్బందిపెట్టడం ఖాయం. అందుకే భారత్ ఈ వ్యవహారాన్ని చాలా సున్నితంగా డీల్ చేస్తోంది. వచ్చే ఏడాది బంగ్లాదేశ్ లో ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పడితే ఈ ఇబ్బందుల నుంచి భారత్ కు కాస్త ఉపశమనం లభించే అవకాశం ఉంది.

## బోల్తాపడ్డ విహారయాత్ర స్కూల్ బస్సు

జడ్చర్ల, మహబూబ్నగర్ జిల్లా బాలానగర్ వద్ద స్కూల్ బస్సు బోల్తా పడింది. పలువురు విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా మరికల్ లోని మణికంఠ జూనియర్ కాలేజీకి చెందిన బస్సు విహారయాత్రకు వెళుతుండగా బోల్తా పడింది. హైదరాబాద్లోని జలవిహార్కు వెళ్లేందుకు కాలేజీకి చెందిన బస్సులో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో బాలా నగర్ వద్ద హైదరాబాద్–బెంగళూరు హైవేపై ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో విద్యార్థులకు స్వల్ప గాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు. త్రుటిలో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# వైసీపీకి సీనియర్ నేత గుడ్ బై.. అప్పుడే జగన్ అన్వేషణ!

అమరావతి, జగన్మోహన్ రెడ్డిని రాజకీయంగా చాలా కుటుంబాలు అండగా నిలిచాయి. ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గం నేతలు తమ సొంత పార్టీలను వదిలి జగన్మోహన్ రెడ్డి వెంట అడుగులు వేశారు. కానీ ఆ పార్టీలో అనుకున్న స్థాయిలో గుర్తింపు సాధించుకోలేకపోయారు. దీంతో ఒక్కొక్కరు బయటకు వెళ్ళిపోయారు. ఇప్పుడు మరో పొలిటికల్ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. అటు జగన్మోహన్ రెడ్డి సైతం ఆ ఫ్యామిలీని లైట్ తీసుకోవడంతో ఇక పార్టీలో ఉండడం భావ్యం కాదని భావిస్తున్నట్లు సమాచారం. వారి స్థానంలో ప్రత్యామ్నాయ నేతను బరిలోదించేందుకు అప్పుడే అన్వేషణ ప్రారంభించారట జగన్మోహన్ రెడ్డి. దీంతో ఆ ఫ్యామిలీ వ్యాపార కార్యకలాపాలకు పరిమితమైంది. ఎన్నికల ముంగిట ఏదో ఒక నిర?యం తీసుకోవాలని చూస్తోంది.

జగన్ తరువాత ఎంపీగా..

కాంగ్రెస్ పార్టీని విభేదించి జగన్మోహన్ రెడ్డి సొంతంగా పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. ఆ సమయంలోనే నెల్లూరు జిల్లాకు చెందిన మేకపాటి ఫ్యామిలీ చేరింది. మేకపాటి రాజమోహన్ రెడ్డి సీనియర్ పొలిటీషియన్. 1989 నుంచి ఆయన ఎంపీ గానే పోటీ చేస్తూ గెలుస్తూ వచ్చారు. జగన్మోహన్ రెడ్డి తో పాటు ఎంపీ పదవిని వదులుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. 2012 ఉప ఎన్నికల్లో గెలిచారు కూడా. 2014 ఎన్నికల్లో సైతం ఆయనే సత్తా చాటారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి. అయితే 2019 ఎన్నికల్లో ప్రత్యక్ష రాజకీయాల నుంచి పక్కకు తప్పుకున్నారు. ఆయన బదులు కుమారుడు గౌతమ్ రెడ్డి రంగంలోకి వచ్చారు. జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహిత నేత గౌతమ్ రెడ్డి. ఆయన వల్లే ఆ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరింది. 2019 ఎన్నికల్లో గౌతంరెడ్డి అసెంబ్లీకి పోటీ చేసి గెలిచారు. జగన్మోహన్ రెడ్డి మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్నారు. అయితే 2022లో చనిపోయారు గౌతమ్ రెడ్డి. ఆయన స్థానంలో తమ్ముడు విక్రమ్ రెడ్డి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ జగన్ మంత్రిగా అవకాశం ఇవ్వలేదు. అప్పటినుంచి మేకపాటి ఫ్యామిలీలో ఒక రకమైన అసంతృప్తి ఉన్నట్లు తెలుస్తోంది.

బడా నేత కోసం ప్రయత్నం..

గత ఎన్నికలకు ముందు మేకపాటి రాజమోహన్ రెడ్డి సోదరుడు చంద్రశేఖర్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. దీంతో మేకపాటి రాజమోహన్ రెడ్డి తో పాటు ఆయన కుమారుడు విక్రమ్ రెడ్డికి టికెట్ ఇచ్చారు జగన్. అయితే నెల్లూరు జిల్లాలో నేతలంతా బయటకు వెళ్లిపోవడంతోనే జగన్ మేకపాటి ఫ్యామిలీకి రెండో టిక్కెట్ కల్పించారు. కానీ 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత రాజమోహన్ రెడ్డి కి ప్రాధాన్యత తగ్గించారు జగన్మోహన్ రెడ్డి. ఈ నేపథ్యంలో వ్యాపారాలు పై దృష్టి పెట్టింది మేకపాటి ఫ్యామిలీ. ఇటీవల నెల్లూరు వచ్చిన రాజమోహన్ రెడ్డి పార్టీ అధినేత తీరు మార్చుకోవాలని సూచిస్తూ విలువైన సలహాలు ఇచ్చారు. అయితే దీనిని సానుకూలంగా తీసుకోకుండా ప్రతికూలంగా తీసుకున్నట్లు తెలుస్తోంది జగన్మోహన్ రెడ్డి. అందుకే ఆయన స్థానంలో టిడిపిలో ఉన్న ఒక బడా నేతను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం టిడిపిలో ఎంపీగా ఉన్న ఓ నేతను నెల్లూరుకు రప్పించి ఎంపీగా పోటీ చేయించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. అతని కుమారుడికి అసెంబ్లీ టికెట్ ఇస్తానని కూడా ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. మొత్తానికైతే ఈ పరిస్థితులు చూస్తుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆ సీనియర్ నేత దూరమైనట్టే.



## శ్రీశైలం టోల్ గేటు వద్ద మద్యం,మాంసం పట్టివేత

శ్రీశైలం,కొంతమంది దుర్మార్గులు పరమ పవిత్రమైన శ్రీశైల పుణ్యక్షేత్ర పరిధిలో తప్పుడు పనులు చేయడానికి సిద్ధమయ్యారు. భారీగా మాంసం, మద్యాన్ని క్షేత్ర పరిధిలోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. టోల్ గేట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో రెడ్ హ్యాండెడ్గా దొరికిపోయారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిని చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాసరావు పట్టుకున్నారు. శ్రీశైలం టోల్ గేట్ వద్ద చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాసరావు సిబ్బందితో

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com